J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 నెల్లూరు, 24.04.2020, శుక్రవారం సంపుటి : 39 సంచిక : 47 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com

# 'లాక్' తీస్తే.. షాకే!

- మే ఆఖరి దాకా మూతే?
- లాక్‌డౌన్ సడలిస్తే ప్రమాదమే
- 12 రాష్ట్రాలలో తీవ్రంగా వైరస్
- ఇంకా విస్తరిస్తున్న ముప్పు



ప్రపంచంలోని మిగతా దేశాలతో పోలిస్తే భారతదేశంలో కరోనా వైరస్ తీవ్రత తక్కువుగా వున్నప్పటికీ, నిర్లక్ష్యం చేస్తే మాత్రం దేశం భారీ మూల్యం చెల్లించాల్సి వుంటుంది. ఇప్పటిదాకా చేసిన శ్రమ అంతా ఒక ఎత్తు... ఇకముందు చేయాల్సిన శ్రమ ఒకెత్తు! కరోనా వైరస్‌పై పోరాటంలో కీలక దశకు వచ్చాం. ఈ దశలో యుద్ధానికి విరామం ఇచ్చేప్రసక్తే వుండకూడదు. దేశానికి కరోనా వైరస్‌తో పొంచివున్న ముప్పు రెండు వారాల లాక్‌డౌన్ తోనో, నెలరోజుల నిర్బంధంతోనే పోయేది కాదు. వైరస్ ముప్పును పూర్తిగా తొలగించుకోవాలంటే దేశ ప్రజలు ఇంకొన్ని రోజుల పాటు త్యాగాలకు సిద్ధపడక తప్పదు.

## ప్రమాదంలో పెద్ద రాష్ట్రాలు

యూరప్ దేశాలంతటి తీవ్రంగా భారతదేశంలో కరోనా వైరస్ వ్యాప్తి లేకపోయినప్పటికీ, గుండెల మీద చేయి వేసుకుని నిబంధనలు (మిగతా 11వ పేజీలో)



## బీజేపీ అధ్యక్షులు.. బాబు సేవకులు?

కన్నా విమర్శల వెనుక పరమార్థం

గుంటూరు మేయర్ పదవేనా? 11లో



# నెల్లూరు కుదుటపడేనా?

- డేంజర్ జోన్‌లో నుండి సేఫ్‌జోన్‌లోకి ఎప్పుడు?
- కొద్దిరోజులుగా నిలకడగా కేసులు
- గ్రీన్‌జోన్‌లోకి మరికొన్ని మండలాలు

***నెల్లూరుజిల్లాలో కరోనా వైరస్ తీవ్రత తగ్గుముఖం పట్టిందా? పరీక్షలలో వేగం పెంచడం ద్వారా వైరస్ వ్యాప్తిని అడ్డుకోగలిగామా? ఈ కోణంలో చూస్తే రాష్ట్రంలోనే తొలి కరోనా పాజిటివ్ కేసు నమోదైన నెల్లూరుజిల్లాలో కొంత ఆశాజనక వాతావరణమే కనిపిస్తోంది. ఒక దశలో రాష్ట్రంలోనే కరోనా కేసుల్లో మొదటి స్థానంలో నిలిచిన నెల్లూరుజిల్లా ఆ తర్వాత ఐదో స్థానంలో నిలవడం తెలిసిందే! కర్నూలు, గుంటూరు జిల్లాల్లో కేసులు విపరీతంగా పెరిగాయి.***

ఈనెల 23వతేదీ నాటికి నెల్లూరుజిల్లాలో నమోదైన కేసుల సంఖ్య 67. ఇందులో ఎక్కువ కేసులు నెల్లూరు నగరం, నాయుడుపేట పట్టణాలలోనే నమోదై వున్నాయి. కొన్ని మండలాలలో ఒకటి, రెండు కేసులు మాత్రమే వున్నాయి. అవి వచ్చి కూడా 14రోజులు దాటిపోవడం, కొత్తగా అక్కడ కేసులేమీ రాకపోవడంతో ఈ మండలాలు సేఫ్ జోన్‌లోకి వచ్చినట్లే! ఒక్క నెల్లూరు నగరం, నాయుడుపేట పట్టణాలలో మాత్రం కొద్దిరోజులు కఠిన నిబంధనలు తప్పవు. జిల్లాలో ఇంకొన్ని రోజులు కొత్త కేసులు వెలుగుచూడకపోతే మనం సేఫ్‌లో పడ్డట్లే!

# ఆ రెండుజిల్లాల్లో వైరస్ రేస్..

- ఎమ్మెల్యేల నిర్వాకమే ముంచిందా?
- డేంజర్ జోన్‌లో కర్నూలు, గుంటూరు జిల్లాలు
- శరవేగంగా విస్తరిస్తున్న కరోనా వైరస్





***రాష్ట్రంలోని 13 జిల్లాల్లో చూస్తే కరోనా వైరస్ మూడు జిల్లాల్లో పరుగులు పెడుతోంది. కర్నూలు, గుంటూరు, చిత్తూరుజిల్లాల్లో వైరస్ ప్రమాదకర స్థాయిలో విస్తరిస్తోంది. వైరస్ కేసుల్లో కర్నూలు, గుంటూరుజిల్లాలు సెంచరీలు దాటాయి. కర్నూలులో అయితే వైద్యులు, వైద్య సిబ్బంది కూడా వైరస్ బారినపడ్డారు. ఒక వైద్యుడు కూడా మరణించడం తెలిసిందే! గుంటూరు జిల్లాలోనూ ఇదే పరిస్థితి.***

కర్నూలు, గుంటూరులలో ఢిల్లీ మర్కజ్‌కు పోయివచ్చిన వారి పూర్తి వివరాలు అందించడంలోనూ, వారిని క్వారంటైన్‌కు పంపించడంలోనూ చేసిన అశ్రద్ధ మూలంగానే ఇక్కడ కేసుల సంఖ్య పెరిగినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి అనుమానితులను క్వారంటైన్‌కు పంపకుండా స్థానిక ఎమ్మెల్యేలు అడ్డుపడ్డారనే ఆరోపణలు కూడా వున్నాయి. శ్రీకాళహస్తిలోనూ సడెన్‌గా కేసులు పెరగడంపై స్థానిక ఎమ్మెల్యేపై విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా మిగిలిన 11 జిల్లాల్లో ఈరోజు కాకుంటే రేపటికైనా వైరస్ అదుపులోకి వచ్చే పరిస్థితి ఉన్నా, కర్నూలు గుంటూరు జిల్లాలే ఆందోళన కలిగిస్తున్నాయి.

## రాయపాటి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా
# వికలాంగులకు నిత్యావసర సరుకులు



నెల్లూరు పడారుపల్లిలోని ఆచార్య పి.సి.రెడ్డి సమాజ మందిరంలోని 50 మంది వికలాంగులకు ఈనెల 22న మాజీఎమ్మెల్యే స్వర్గీయ స్వర్ణా వేమయ్య జ్ఞాపకార్ధం రాయపాటి చారిటబుల్ ట్రస్ట్ వారు బియ్యం, పప్పు, నూనె, కూరగాయలు అందించారు. ఈ కార్యక్రమంలో స్వర్ణా గంగాధర్, క్రాంతి మహిళా మండలి అధ్యక్షురాలు శ్రీమతి జి.వెంకటలక్ష్మి, ఒరిస్సా శ్రీనివాసులురెడ్డి, కోటిరెడ్డి, యానాదిరెడ్డి, దైవాధీనం, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## షిరిడి సాయి మందిరంలో
# ఆహార ప్యాకెట్లు పంపిణీ




నెల్లూరు నవాబుపేట ఎఫ్‌సీఐ కాలనీ సాయినగర్‌లో వున్న శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో ఈ నెల 23, గురువారం లాక్‌డౌన్ సందర్భంగా ఇబ్బందులు పడుతున్న దాదాపు 250 మంది నిరుపేదలకు ఆహార ప్యాకెట్లును పంపిణీ చేశారు. మందిరం గౌరవాధ్యక్షులు యనమల క్రిష్ణయ్య, ఆలయ మేనేజింగ్ ట్రస్టీ నాగిశెట్టి బాబూరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మేకల రమేష్‌బాబు, టీచర్ పెంచలయ్య, రాజగోపాల్, కమిటీ సభ్యులు సహకారమందించారు.

## కిమ్స్ ఆసుపత్రి..
# 700 పీపీఈ కిట్లు వితరణ



నెల్లూరులోని కిమ్స్ ఆసుపత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తాళ్ళూరి గిరినాయుడు ఈనెల 20న నెల్లూరు ఇస్కాన్ సిటీలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి అనిల్ కుమార్‌యాదవ్‌ను కలిసి కరోనా నియంత్రణలో భాగంగా 700 పీపీఈ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి అనిల్ మాట్లాడుతూ లాక్‌డౌన్ సందర్భంగా పార్టీలకతీతంగా సహాయ సహకారాలు అందిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. పేదలకు సాయం చేయడాన్ని అడ్డుకుంటున్నారని దుష్ప్రచారం చేయడం ప్రతిపక్ష నాయకులకు తగదన్నారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయ ఇన్‌చార్జి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు రూప్‌కుమార్‌యాదవ్, డాక్టర్ వీ.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



## కావలి ఎమ్మెల్యేకు
# కోవిడ్ పరీక్షలు


కరోనా వైరస్ ప్రబలుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో అందరూ కోవిడ్ పరీక్షలు చేయించుకోవాలని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఈనెల19న ఎమ్మెల్యే, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మన్నెమాల సుకుమార్‌రెడ్డి కరోనా పరీక్షలు చేయించుకోగా నెగటివ్ వచ్చింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల కోసం ప్రతినిత్యం వారి వద్దకే వెళ్తున్నందున దేవుడు తమకు ఆశీస్సులు అందజేస్తున్నారన్నారు. కరోనా అనుమానం వస్తే అందరూ ఖచ్చితంగా పరీక్షలు చేయించుకోవాలన్నారు.

## డ్వాక్రా మహిళలకు
# సున్నా వడ్డీ

నెల్లూరుజిల్లాలోని డ్వాక్రా మహిళలకు వైయస్సార్ సున్నా వడ్డీ కింద రూ.65.59 కోట్లను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేశారని డీఆర్డీఏ పీడీ శీనానాయక్ తెలిపారు. ఈనెల 19న నెల్లూరు జెడ్పీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ సున్నా వడ్డీ పథకం కింద 34,051మంది డ్వాక్రా మహిళలు లబ్ధి పొందనున్నారని, ఈ పథకాన్ని 24న ప్రభుత్వం లాంఛనంగా ప్రారంభించనుందని తెలిపారు.

# టెలీ మెడిసిన్ ద్వారా వైద్యం

వైయస్సార్ టెలీ మెడిసిన్ సేవలు జిల్లాలో అందుబాటులోకి వచ్చాయని జిల్లా జాయింట్ కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. ఈనెల 22న నెల్లూరు జడ్పీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ ఈ సేవలు కోసం 14410కు ఫోన్ చేస్తే వ్యాధిగ్రస్తుడి వ్యాధిని గుర్తించి వైద్యసేవలు ఉచితంగా అందిస్తారన్నారు. వ్యాధికి గురైనవారు ఏ ప్రాంతంలో ఉన్నారో గుర్తించి వారికి అవసరమైన మందులు ఇంటివద్దకే వచ్చి అందజేస్తారని, రక్తకోష్ అనే వెబ్‌సైట్‌ను ప్రారంభించామని, దీని ద్వారా అవసరమైన రక్తాన్ని రోగులు పొందవచ్చన్నారు. ఎవరైనా దాతలు రక్తం ఇవ్వాలనుకుంటే వెబ్‌సైట్ లో వివరాలు తెలియజేస్తే రక్తనిధి ప్రతినిధులు ఆ దాత రక్తాన్ని సేకరిస్తారని తెలిపారు.




## బిల్డర్స్ అసోసియేషన్ భూరివిరాళం

కరోనా వైరస్ నేపథ్యంలో బాధితుల సహాయార్థం బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సీఎం సహాయనిధికి 75 లక్షల రూపాయలు, అలాగే కెపిసి ప్రాజెక్ట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ కె.అనిల్‌కుమార్ పాతిక లక్షలు మొత్తం కోటి రూపాయలను అందజేశారు. ఇటీవల రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి పి.అనిల్ కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో అసోసియేషన్ అధ్యక్షులు దేవిరెడ్డి పంకజ్‌రెడ్డి తాడేపల్లిలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డిని కలిసి ఈ విరాళం చెక్కును అందజేశారు.

## విజేత.. మానవుడే!

మనిషిప్పుడు
శత్రుదేశపు సైనికుడిలా
సాక్షాత్కరిస్తున్నాడు
చావుకీ బ్రతుక్కీ మధ్య
తనకుతాను దహనమవుతున్నాడు
మనిషికి మనిషే ప్రాణభిక్ష
పెట్టాల్సిన వైపరీత్యం రాజ్యమేలుతోంది
గురిపెట్టిన తుపాకీ పేల్చే క్షణాన
ఘనీభవించిన మౌనంలా మనిషి
నది నుంచి చీలిన పాయలా
ఇక ఒంటరిగానే ప్రవహిద్దాం
మహానగమై నిలబడి ఆత్మస్థైర్యంతో
జీవయాత్ర సాగిద్దాం
కన్నీటి నిధుల్ని గడ్డకట్టించి
దారి తప్పిన పతంగాన్ని గమ్యానికి చేరుద్దాం
మనిషి మనిషికీ మధ్య
ఎడబాటు విస్ఫోటనంలో
జైత్రయాత్ర కేతనం ఎగురవేద్దాం.
మృత్యువు సంకేతాల్లో వేగంగా అల్లుకొన్న
తీగల్ని చాకచక్యంగా త్రెంపి
క్వారంటైన్‌కు కొత్త అర్థం చెప్పి
సరిహద్దు రేఖను నియంత్రించుకొందాం
నరాలు తెగే ఉత్కంఠకు తెరవేసి
సరికొత్త మానవుణ్ణి ఆవిష్కరించుకొందాం
సాలీడు గూడును మళ్ళీ మళ్ళీ
నిర్మించుకొన్నట్లు
స్నేహస్వప్నాల్ని తిరిగి మొలిపించుకొందాం
దుస్సాహసంగా విరుచుకుపడ్డ
కీటక ధ్వని తరంగాన్ని స్వీయ
నియంత్రణతో తరిమికొడదాం.
మనల్ని మనమే వెలిగించుకొని
కాంతిదీపాలమవుదాం
ఉపద్రవాల్ని మట్టుపెట్టే
వేకువజాడలవుదాం
మరణాల అంచుల్లో వ్యాక్సిన్ తో
వినూత్న రహదారులేసుకొందాం
విరాట్ రూపాన్ని తనలో దాచుకొన్న
విశిష్ట శక్తివంతులైన
మానవులం మనం
కోవిడ్ అంటే మరణంకాదని
ఎలుగెత్తిచాటుదాం!



- చిన్ని నారాయణరావు
9440202942

### సిఎం సహాయనిధికి..

## ఎన్‌బికెఆర్ సిబ్బంది ఒకరోజు వేతనం

కరోనా మహమ్మారి వ్యాధి వ్యాప్తి నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు తమవంతు సాయంగా కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలోని అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తమ ఒకరోజు వేతనం 3,56,629 రూపాయలను సిఎం సహాయనిధికి విరాళంగా అందించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ మొత్తాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ఏపిపిఇసిఎంఏ) కార్యాలయం అకౌంట్‌కి జమ చేసినట్లు కళాశాల డైరెక్టర్ డా. వి.విజయకుమార్‌రెడ్డి తెలియజేశారు. ఈ విరాళాన్ని ఏపిపిఇసిఎంఏ ప్రెసిడెంట్, కళాశాల కరెస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రి సహాయనిధికి అందజేస్తారని ఆయన పేర్కొన్నారు.

## రెడ్‌క్రాస్ రక్తదానం




కరోనా వైరస్ మహమ్మారి, లాక్‌డౌన్‌ల నేపథ్యంలో కరోనా బాధితులకు రక్తనిధి నిల్వలు చాలినంతగా ఏర్పాటుచేసుకోవాలనే ఉద్దేశంతో హెల్పింగ్ హ్యాండ్ సొసైటీ ప్రెసిడెంట్ కుంచాల విజయభాస్కర్ ఆధ్వర్యంలో బాధితుల తక్షణ అవసరాలకు పలువురు రక్తదాతలు ఈనెల 20న రెడ్‌క్రాస్ రక్తనిధికి వచ్చి రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ సారధ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నెల్లూరు వైఎస్సార్సీపి ఇన్‌చార్జి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, రెడ్‌క్రాస్ ఛైర్మెన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలు పాల్గొని ఆ రక్తదాతలను అభినందించారు.

## ఏకాంతంగానే పెంచలకోన బ్రహ్మోత్సవాలు

జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు మే నెల 3వ తేది నుంచి 9వ తేది వరకు జరుగుతాయని, అయితే ఈసారి ఏకాంతంగా స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్య చెప్పారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 3న గోనుపల్లి నుంచి ఎద్దలబండిలో స్వామివారు, అమ్మవార్ల ఉత్సవమూర్తులను తీసుకువస్తామని, రాత్రికి అంకురార్పణ జరుగుతుందని, 4న ఉదయం ధ్వజారోహణ, రాత్రికి శేషవాహనం, 5న ఉదయం హంస వాహనం, రాత్రికి బంగారు హనుమంతసేవ, 6న ఉదయం సింహవాహనం, రాత్రికి బంగారు గరుడవాహనం నిర్వహిస్తామన్నారు. 7న స్వామి, అమ్మవార్ల కల్యాణం, రాత్రికి గజవాహన సేవ ఉంటాయని, 8న వసంతోత్సవం, చక్రస్నానం, అశ్వవాహనసేవ, అనంతరం ధ్వజావరోహణం ఉంటాయని, 9న స్వామివారు, అమ్మవార్లు గోనుపల్లికి చేరుకుంటారని అన్నారు.



### కరోనా సహాయార్థం...

## ఏఎంఆర్ కోటి విరాళం

ఆధ్యాత్మిక, మానవతా కార్యక్రమాలకు ఎప్పుడూ ముందుండే ఆల్తూరు కుటుంబం కరోనా విపత్తు నేపథ్యంలోనూ తమ దాతృత్వం చాటుకుంది. ఏఎంఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత ఆల్తూరు మహేష్‌రెడ్డి కరోనా బాధితుల సహాయార్థం కోటిరూపాయల విరాళాన్ని ఇటీవల తెలంగాణ మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌కు అందజేశారు. కరోనా విపత్తు సమయంలో మానవతా దృక్పథాన్ని చాటుకున్న ఆల్తూరు మహేష్‌రెడ్డిని కేటీఆర్ అభినందించారు.

## ఇలాంటి సమయంలో ప్రభుత్వంపై విమర్శలా

- ఎమ్మెల్యే ప్రసన్న



కరోనా మహమ్మారి నుంచి ప్రజల ప్రాణాలను కాపాడే పనిలో ప్రభుత్వం ఉంటే చంద్రబాబు ఇలాంటి సమయంలో ప్రభుత్వంపై విమర్శలు చేయడం బాధాకరమని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 20 న కొడవలూరు మండలంలోని నార్తు రాజుపాళెం వీసీఆర్ అతిథి గృహంలో గ్రామానికి చెందిన రేషన్ కార్డు లేని 300 కుటుంబాలకు ఆయన నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో పరిస్థితిని సీఎం ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ వైరస్ నివారణకు చర్యలు తీసుకుంటుంటే చంద్రబాబు, ఆయన బృందం ఓర్వలేక పోతున్నారన్నారు. బాబు లాంటి దుష్ట రాజకీయ నాయకుడు చరిత్రలోనే ఉండరని విమర్శించారు. డీసీఎంయస్ ఛైర్మన్ వీరి చలపతిరావు, మండల కన్వీనర్ గంధం వెంకట శేషయ్య, కొండా శ్రీనివాసులురెడ్డి, మధుసూదనరెడ్డి, మాణిక్యరావు, జనార్ధన్ రెడ్డి, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

### చర్మవ్యాధి సమస్యలకు

## ఉచితంగా టెలి వైద్యం

@ 7799992709 / 8919846069

కరోనా కష్టకాలంలో చర్మవ్యాధి సమస్యలకు ఉచితంగా సలహాలు, సూచనలతో పాటు టెలి వైద్యం అందించడానికి బృందావనంలోని ప్రముఖ చర్మవ్యాధి నిపుణులు డాక్టర్ కె.నాగార్జున, డా॥ కె.దీపక్‌లు సహృదయంతో ముందుకొచ్చారు.

చర్మ సంబంధిత సమస్యలతో బాధపడేవాళ్ళు క్రింది నెంబర్లకు వాట్సాప్ ద్వారా వారి పేరు, స్త్రీ/పురుషుడు, వయసు, సమస్య ఎన్ని రోజుల నుండి వుంది, జిలేమైనా ఉందా? మందులేమైనా వాడారా? వంటి ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ వ్యాధికి సంబంధించిన ఫోటోని జతచేసి పంపిస్తే.. వెంటనే డాక్టర్లు స్పందించి రోగి వాడాల్సిన మందులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర విషయాలను రిప్లై మెసేజ్ ద్వారా తెలియజేస్తారు. ఈ సదుపాయాన్ని నెల్లూరుజిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవలసిందిగా ఈ డాక్టర్లు కోరుతున్నారు.

డాక్టర్లను సంప్రదించవలసిన నెంబర్లు :

డా॥ నాగార్జున 7799992709

డా॥ దీపక్ 8919846069

## 'ప్రభా'తం

# సవాల్‌ను స్వీకరిద్దాం!

ఈ భూమ్మీద తలెత్తే ప్రతి ప్రకృతి వైపరీత్యం మానవాళికి ఒక సవాలు విసురుతోంది. ప్రతి పని వెనుక కూడా ఒక పరమార్థం ఉంటుంది. మనిషి తన సామర్థ్యంతో ఎలాంటి పరిణామాలనైనా ఎదుర్కొంటాడు అనే సాక్ష్యాలను ఆవిష్కరిస్తుంటుంది. చరిత్రను లోతుగా విశ్లేషించి చూస్తే... ప్రతి వైపరీత్యం కూడా ప్రపంచానికి ఒక పాఠాన్ని, ఒక గుణపాఠాన్ని నేర్పిస్తోంది. అదే సమయంలో సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనే ధైర్యాన్ని కూడా ఇస్తోంది. ఇప్పుడు కరోనా వైరస్ కూడా ప్రపంచానికి ఒక గుణపాఠంగా మారింది. మనిషి ప్రకృతిని, పర్యావరణాన్ని నాశనం చేస్తున్న పాపానికి.. అది శాపమై ఈరోజు ఈ భూమ్మీద 210 దేశాలను కరోనా వైరస్ రూపంలో పట్టి పీడిస్తోంది.

రెండో ప్రపంచ యుద్ధం జపాన్ అనే చిన్న దేశాన్ని అతలాకుతలం చేసింది. ఆ దేశానికి చెందిన కోట్లాది మంది ప్రజలు మరణించారు. అణుబాంబుల దాటికి హీరోషిమా, నాగసాకి నగరాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. రెండో ప్రపంచ యుద్ధం జపాన్‌కు అతిపెద్ద సవాల్‌గా నిలిచింది. ఈ యుద్ధంతో జపాన్ కుంగిపోలేదు, అంతకంతకు పట్టుదలతో పోరాడింది. అనతి కాలంలోనే అన్ని రంగాలలో అభివృద్ధి సాధించింది. అగ్రరాజ్యాల సరసన నిలిచింది.

ఈరోజు కరోనా వైరస్ ప్రపంచ యుద్ధాల కంటే కూడా పెద్ద విపత్తుగా మారింది. ప్రపంచ చరిత్రలో 210 దేశాలను ప్రభావితం చేసిన పరిణామం ఏదైనా ఉందంటే అది కరోనా వైరస్సే! చిన్నా పెద్దా తేడా లేకుండా అర్జెంటీనా మొదలుకొని అమెరికా దాకా అన్ని దేశాలు దీని బారిన పడ్డాయి. లక్షలాది మంది ప్రజలు రోగాల బారిన పడగా, ప్రతి దేశంలో వేల సంఖ్యలో మరణాలు నమోదవుతున్నాయి. అయితే కరోనా వైరస్ మూలంగా ప్రపంచంలోని అన్ని దేశాలు దెబ్బతిన్నది ఒక ఎత్తయితే... ఈ వైరస్‌ను సమర్థవంతంగా ఎదుర్కొని భారత్ అనే వర్ధమాన దేశం నిలబడడం ఒక ఎత్తు. అన్ని దేశాల మాదిరిగానే భారతదేశాన్ని కూడా ఈ వైరస్ పట్టి పీడిస్తోంది. భారత దేశంలో విధించిన లాక్‌డౌన్ మూలంగా దేశ ఆర్థిక వ్యవస్థ లక్షలాది కోట్ల రూపాయలను నష్టపోయింది. అయితే భారతదేశంలో ధనం కంటే మనిషి ప్రాణానికి విలువ ఎక్కువ. అమెరికాలో ప్రాణ నష్టం కంటే ఆస్తి నష్టంకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. ఆర్థికంగా అగ్రరాజ్యం హోదా పోకూడదనే ఉద్దేశంతో ఆ దేశ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అమెరికాలో కేసులు వేలంవెర్రిగా పెరుగుతున్నా లాక్‌డౌన్ అమలుకి మీనమేషాలు లెక్కించాడు. మనుషుల ప్రాణాలు పోతే పోనీ తమ దేశ ఆర్థిక వ్యవస్థ నష్టపోకూడదన్నట్లు వ్యవహరించాడు. ఆయన నిర్లక్ష్యం మూలంగానే అమెరికాలో లక్షల్లో వైరస్ కేసులు, వేలల్లో మరణాలు నమోదయ్యాయి.

ఇక ఈ వైరస్ జన్మస్థానం చైనా అన్న సంగతి అందరికీ తెలిసిందే! ప్రపంచంలో తన ఆధిపత్యాన్ని నిలుపుకునేందుకు, అమెరికా అగ్రరాజ్య హోదాను కొల్లగొట్టేందుకు చైనా ఈ వైరస్ నాటకం ఆడింది అన్న అనుమానాలు లేకపోలేదు. ఈ అనుమానంతోనే అమెరికా నిఘా సంస్థ ఈ వైరస్‌పై విచారణ కూడా మొదలు పెట్టింది. భవిష్యత్తులో అమెరికా చైనాల మధ్య ఇది ప్రచ్ఛన్న సమరానికి కూడా దారి తీసే అవకాశం ఉంది. అమెరికా చైనాలను పక్కనపెడితే మిగిలిన దేశాలది చావు బ్రతుకు సమస్య. ఇతర దేశాలకు అగ్రరాజ్య హోదా అవసరం లేదు, ఆధిపత్యం తాపత్రయం లేదు. అమెరికా చైనాల మధ్య ఆధిపత్య పోరులో మేమెందుకు చావాలన్నది ఆ దేశాల అభిమతం. అందుకే ఆ దేశాలన్నీ కూడా ఇప్పుడు ఒక ప్రత్యామ్నాయ వేదిక కోసం భారత్ వైపుగా చూస్తున్నాయి. 'సర్వేజనా సుఖినోభవంతు' అన్న సిద్ధాంతంతో ప్రపంచమంతా బాగుండాలని కోరుకునే ఏకైక దేశం భారత్. ప్రపంచాన్నంతా కరోనా వైరస్ గజగజలాడిస్తున్న ఈ తరుణంలో... భారత్ ఆ స్ఫూర్తిని అక్షరాల ఆచరణలో చూపించింది. అన్ని దేశాలకు అవసరమైన మందులు, వైద్య పరికరాలను పంపించి అన్ని దేశాల అభిమానాన్ని సంపాదించుకుంది. కాబట్టే ఇప్పుడు అన్ని దేశాలు కూడా భారత్ వైపు అభిమానంగా చూస్తున్నాయి. ఈ కరోనా కాలంలో కూడా 130 కోట్ల జనాభాని ఏకతాటిపై నడిపిన నరేంద్ర మోడీ నాయకత్వం కూడా భారతదేశ ప్రతిష్టను అమాంతం పెంచేసింది.

కరోనా వైరస్ ప్రభావంతో చైనాలో తమ పరిశ్రమలను మూసేయడానికి ఆయా దేశాలు సన్నద్ధం అవుతున్నాయి. జపాన్‌తో సహా యూరోపియన్ దేశాలన్నీ కూడా అక్కడ తమ పెట్టుబడుల ఉపసంహరణకు శ్రీకారం చుట్టాయి. భారత్ ఈ పరిణామాన్ని ఉపయోగించుకోవాలి. ఆసియా ఖండంలో చైనా తర్వాత భారత్‌దే అతి పెద్ద మార్కెట్ వ్యవస్థ. ఈ సమయంలో భారత పాలనా యంత్రాంగం సమర్థవంతమైన చర్యలు తీసుకొని, విదేశీ పెట్టుబడులకు సమగ్ర ప్రణాళికను రూపొందించి అమలు చేస్తే... భవిష్యత్తులో భారత్ అగ్రరాజ్యంగా మారడానికి పెద్ద సమయం పట్టదు. కరోనా వైరస్ మనకు అపాయకారి కాదు ప్రయోజనకారి... అనే రీతిలో ఈ వాతావరణాన్ని మార్చుకోవలసి ఉంది. భారత ప్రధాని నరేంద్ర మోడీ కూడా కరోనా వైరస్ అనంతరం ప్రపంచంలో అనేక మార్పులు జరగ బోతున్నాయని, ఈ పరిణామాలను సమర్ధవంతంగా ఎదుర్కొని కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవడానికి సన్నద్ధం కావాలని భవిష్యత్‌పై ఆశలు కల్పిస్తూ చేసిన వ్యాఖ్యలు ఆశాజనక వాతావరణానికి సంకేతంగా చెప్పుకోవచ్చు.



'సర్వేజనా సుఖినోభవంతు' అన్న సిద్ధాంతంతో ప్రపంచమంతా బాగుండాలని కోరుకునే ఏకైక దేశం భారత్. ప్రపంచాన్నంతా కరోనా వైరస్ గజగజలాడిస్తున్న ఈ తరుణంలో... భారత్ ఆ స్ఫూర్తిని అక్షరాల ఆచరణలో చూపించింది. అన్ని దేశాలకు అవసరమైన మందులు, వైద్య పరికరాలను పంపించి అన్ని దేశాల అభిమానాన్ని సంపాదించుకుంది. ఈ కరోనా కాలంలో కూడా 130 కోట్ల జనాభాని ఏకతాటిపై నడిపిన నరేంద్ర మోడీ నాయకత్వం కూడా భారతదేశ ప్రతిష్టను అమాంతం పెంచేసింది. కరోనా ప్రభావంతో చైనాలో తమ పరిశ్రమలను మూసేయడానికి ఆయా దేశాలు సన్నద్ధం అవుతున్నాయి. ఈ సమయంలో భారత్ విదేశీ పెట్టుబడులకు సమగ్ర ప్రణాళికలు రూపొందిస్తే... అగ్రరాజ్యంగా మారడానికి ఎంతో సమయం పట్టదు!

# రెండో పంటకు నీళ్ళొచ్చేశాయ్

**- తొలిసారిగా నాన్‌డెల్టాలోని 67,500 ఎకరాలకు సాగునీరు**

జిల్లాలో రెండవ పంట సాగుచేసుకునేందుకు సోమశిల జలాశయం నుంచి తొలిసారిగా నాన్‌డెల్టాలోని 67,500 ఎకరాలకు ఈనెల 20న అధికారులు నీళ్ళను విడుదల చేశారు. మంత్రులు మేకపాటి గౌతమ్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్‌యాదవ్‌లు ఇటీవల రైతులకు ఇచ్చిన హామీ మేరకు జలాశయం చరిత్రలోనే మొదటిసారిగా రెండో పంటకు సంబంధించి ఈ నీటిని విడుదల చేయడం విశేషం. దీంతో నాన్‌డెల్టా రైతులు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నీళ్ళను విడుదల చేసే సందర్భంలో తొలుత నీటిపారుదల ఎస్‌ఇ రవీంద్రనాథ్ గంగమ్మకు పూజలు చేశారు. 11వ క్రస్ట్ గేటు ద్వారా 500 క్యూసెక్కుల నీటిని పెన్నార్ డెల్టాకు లాంఛనంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఇ మాట్లాడుతూ సోమశిల జలాశయంలో ప్రస్తుతం 44.6 టిఎంసిల నీళ్ళు నిల్వ ఉన్నాయని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెన్నార్ డెల్టాకు 1,950 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తామని, నాన్‌డెల్టా పరిధిలోని ఉత్తర, దక్షిణ కాలువలు, కావలి కాలువల ప్రాంతాల్లో రెండవ పంట వ్యవసాయ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని, అందుకోసం రైతులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు.

# కరోనా నివారణ చర్యలకు కోటీ 10 లక్షల విరాళం

**- మంత్రికి అందజేసిన ఆక్వా ఎగుమతిదారులు**

కరోనా నియంత్రణా చర్యలకై స్వచ్ఛందంగా ముందుకు వచ్చి జిల్లా యంత్రాంగానికి తమ వంతు సహకారం అందిస్తున్న దాతలకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డా. పోలుబోయిన అనిల్‌కుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు. సోమవారం సాయంత్రం నెల్లూరులోని జిల్లా పరిషత్ ఆవరణలోని డి.ఇ.ఓ.సి. వద్ద జిల్లా ఆక్వా ఎగుమతిదారుల సంఘాల ప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యే బీదా మస్తాన్ రావు ఒక కోటి రూపాయలు, ఆక్వా ఫీడ్ డీలర్ల ప్రతినిధులు 10 లక్షల రూపాయలు చెక్కు రూపంలో కోవిడ్-19 నియంత్రణకై మంత్రి డా. అనిల్‌కుమార్ సమక్షంలో జిల్లా కలెక్టర్ యం.వి.శేషగిరిబాబుకు అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి డా.అనిల్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ, విపత్కర పరిస్థితుల్లో, ఆపద సమయంలో ప్రజలను ఆదుకోవాలన్న ఆలోచనతో ప్రభుత్వానికి తమ వంతు సహకారం అందించేందుకు ముందుకు వస్తున్న దాతలు, స్వచ్ఛంద సంస్థలకు



అభినందనలు తెలిపారు. నెల్లూరు నగరంలో పారిశుధ్య విధులు నిర్వర్తిస్తూ వ్యక్తిగత అనారోగ్య సమస్యతో మరణించిన పారిశుధ్య కార్మికుడు శంకర్ రావు కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవడం జరుగుతుందని మంత్రి డా.అనిల్‌కుమార్ తెలిపారు.

## మానవత్వం పరిమళించే ఉంది

సమాజంలో మంచి, చెడు ఎప్పుడూ ఉంటూనే ఉంటాయి. సమయం, సందర్భాన్ని బట్టి అవి బయటకు వస్తుంటాయి. సాధారణ వాతావరణంలో అయితే బయట ప్రపంచంలో మనమెప్పుడూ చెడును ఎక్కువగా చూస్తుంటాం. అయితే మనుషుల్లో మానవత్వం ఇంకా మిగిలి ఉంది అనేదానికి అప్పుడప్పుడు కొన్ని ఉత్పాతాలు వస్తుంటాయి. ఇప్పుడు కరోనా వైరస్ కూడా అలాంటిదే! ఈ వైరస్ మూలంగా దేశంలో లాక్‌డౌన్ అమలులోకి వచ్చినప్పటి నుంచి ప్రతి గ్రామంలోనూ, ప్రతి నగరంలోనూ ఎంతోమంది మానవతావాదులు నిరాశ్రయులైన ఎంతోమందికి వివిధ రూపాలలో సాయం అందిస్తుండడం మనిషిలో ఇంకా మంచితనం మిగిలి ఉంది అనడానికి నిదర్శనం.

*శ్రీచరణ్,* **గూడూరు.**

## పని ఎక్కువ.. ప్రచారం తక్కువ

కరోనా వైరస్‌ను ఎదుర్కొనే క్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమర్థవంతంగా పనిచేస్తోంది. అన్ని రాష్ట్రాల కంటే కూడా వేగంగా స్పందించి దక్షిణ కొరియా నుంచి టెస్ట్ కిట్‌లను దిగుమతి చేసుకొని పరీక్షలలో వేగాన్ని పెంచింది. ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు సైతం ఏపీ ప్రభుత్వం తీరును సమర్థించారు. కాకపోతే ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి గత ముఖ్యమంత్రి చంద్రబాబు లాగా పబ్లిసిటీ చేసుకోవడం లేదు. ఆయన కేవలం పనిమీదే దృష్టి పెట్టి ఉన్నారు. లాక్‌డౌన్‌లో కూడా ప్రజలు ఇబ్బంది పడకుండా వారిని ఆదుకుంటున్నారు. పబ్లిసిటీ జోలికి అస్సలు పోవడం లేదు. అందుకనే రాష్ట్రంలో ప్రభుత్వం సరిగా పనిచేయడం లేదని కొందరు విమర్శిస్తున్నారు. ప్రభుత్వం సమర్థత తెలియాల్సింది పనితీరులోనే కానీ పబ్లిసిటీలో కాదు.

*ఎస్‌కే నజీర్,* **నెల్లూరు.**


## మితిమీరిన మతస్వేచ్ఛ అభివృద్ధికి విఘాతం

ప్రపంచంలో ఏ దేశంలో లేనంత మతస్వేచ్ఛ భారత దేశంలోనే ఉంది. ఇది దేశ ప్రయోజనాలకు విరోధంగా మారుతోంది. మతం అన్నది ప్రజల మానసిక భావోద్వేగాలకు సంబంధించిన విషయం. ఇది ఇంటికి లేదా ఆధ్యాత్మిక మందిరాల వరకు మాత్రమే పరిమితం కావాలి. కానీ భారతదేశంలో మత స్వేచ్ఛ వేలంవెర్రిగా మారుతోంది. దేశం కంటే కూడా మాకు మతమే గొప్పది అన్నట్లుగా కొన్ని వర్గాలవారు వ్యవహరిస్తున్నారు. తమ మత పిచ్చి కోసం ప్రభుత్వ నిబంధనలను సైతం పక్కనపెట్టారు. దీనివల్లే ఈరోజు భారతదేశం కరోనా వైరస్ మూలంగా ఇన్ని లక్షల కోట్లు నష్టపోవాల్సి వచ్చింది. అదే ప్రభుత్వ నిబంధనలను అన్ని వర్గాల వారు పద్ధతిగా పాటించి ఉంటే భారతదేశంలో కరోనా వైరస్ ప్రభావం చాలా స్వల్పమే. కాబట్టి కేంద్ర ప్రభుత్వం కూడా మితిమీరిన మత స్వేచ్ఛకు కళ్లెం వేయాల్సి ఉంది.

*చిరంజీవి,* **నెల్లూరు.**



# మెట్ట వైపుకు రాని కరోనా



నెల్లూరు జిల్లాలో కరోనా వైరస్ తీవ్రంగా ఉండడం తెలిసిందే! నెల్లూరు నగరంతో పాటు నాయుడుపేట వంటి పట్టణంలో కూడా ఈ వైరస్ వీర విజృంభణ చేసింది. తూర్పు మండలాలలో చాలా వరకు కరోనా కేసులు నమోదై ఉన్నాయి. ఒక మండలంలో ఒక్క కేసు ఉన్నా... అది రెడ్‌జోన్‌లో ఉన్నట్టే లెక్క!

అభివృద్ధిలోనూ పంటలలోను ఎప్పుడూ వెనకబడి ఉండే మెట్ట ప్రాంతం ఈ కరోనా వైరస్ విషయంలో కూడా వెనకబడి ఉందనే చెప్పుకోవచ్చు. జిల్లాలో మెట్ట నియోజకవర్గాలుగా పేరున్న ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల పరిధిలో కరోనా వైరస్ కేసులు నమోదు కాకపోవడం చర్చనీయాంశమైంది. ఈ రెండు నియోజకవర్గాల్లో 16 మండలాలకు గాను 14 మండలాలలో ఒక్క కేసు కూడా లేకపోవడం గమనార్హం. అలాగని ఇక్కడ విదేశీయులు లేరంటే.. లేకుండా పోలేదు! చాలా మంది విదేశాల నుండి వచ్చి ఉన్నారు. అలాగే ఢిల్లీ నిజాముద్దీన్ మర్కజ్ పోయి వచ్చిన వాళ్ళు కూడా ఉన్నారు. అయినా ఒక్క కేసు కూడా రాకపోవడం ఇక్కడి ప్రజల అదృష్టమనే చెప్పాలి. ఈ మెట్ట మండలాలు జిల్లాలో సేఫ్‌జోన్‌గా ఉన్నాయి. అందుకేనేమో నెల్లూరు నగరంలో ఉంటున్న ఈ మండలాలకు చెందిన చాలామంది ఇటీవల కాలంలో తిరిగి తమ సొంత గ్రామాలకి చేరుకున్నారు. ఇక్కడ ఉంటే కరోనా కాదు దాని అమ్మ మొగుడు కూడా రాదనే ధీమాతో ఉన్నారు!



## ఈ రంగాలు...

# ఎప్పటికి కోలుకుంటాయో?

కరోనా వైరస్ పెట్టిన చిచ్చు వల్ల చాలా వ్యాపార రంగాలు దారుణంగా దెబ్బతినిపోతున్నాయి. ఈ వైరస్ మూలంగా విధించిన లాక్‌డౌన్‌తో చిన్న, సన్న ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు, దినసరి కార్మికులకు పెద్దగా సమస్య ఎదురు కాకపోవచ్చు, చిన్న చిన్న వ్యాపారులకు కూడా పెద్ద ఆర్థిక నష్టాలు ఉండవు. ఎందుకంటే చిన్న వ్యాపార సంస్థల్లో నిర్వహణ ఖర్చులు తక్కువ, ఉద్యోగులు తక్కువగా వుంటారు. కరెంట్ బిల్లు, నెలసరి నిర్వహణ వ్యయం కూడా తక్కువగానే ఉంటుంది కాబట్టి లాక్‌డౌన్ ఎత్తేసిన తర్వాత ఓ ఆరు నెలలు సాఫీగా వ్యాపారాలు జరిగితే వీళ్లంతా కూడా త్వరగానే కోలుకునే అవకాశం ఉంది!

కానీ ఈ వైరస్ మూలంగా దెబ్బ తిన్నది పెద్ద వ్యాపార సంస్థలే! ముఖ్యంగా మాల్స్, సినిమా థియేటర్స్, హోటల్స్, ప్రైవేటు రవాణా సంస్థలు, భారీ సిబ్బందితో నడిపే పరిశ్రమలు తీవ్ర నష్టాలను ఎదుర్కోబోతున్నాయి. ఎందుకంటే వీళ్లు చెల్లించాల్సిన అద్దెలు, కరెంటు బిల్లులు, ఉద్యోగులకు జీతాలు నెలకి కోట్లలో ఉంటాయి. వీరికి ప్రభుత్వం నుండి ఎటువంటి మినహాయింపులు లేవు. లాక్‌డౌన్ సమయంలోనూ ఉద్యోగులకు జీతాలు ఇవ్వాల్సిందే! ఇక బాడుగలు మినహాయించాలని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ భవనాల యజమానులు కనీసం సగమైనా డిమాండ్‌చేసే అవకాశం వుంది. ఎందుకంటే బ్యాంకులకు నెలసరి వాయిదాలు కట్టుకోవాలి కదా! ఇక కరెంట్ బిల్లు, ఇతరత్రా ఖర్చులు ఏ మాత్రం తగ్గలేదు. అదీగాక కరోనా వైరస్ ప్రభావం తగ్గితే ఇతర వ్యాపార రంగాలకు అనుమతి ఉంటుందేమో గాని, వీటికి మాత్రం ఇంకా కొన్ని నెలలపాటు అనుమతి లభించడం కష్టమే! కాబట్టి కోలుకోవాలంటే ప్రభుత్వాలు వారికి ఆసరాగా ఏదో ఒకటి చేయాల్సిందే!

## అన్నదాతలకు...

# అండగా నిలిచిన ప్రభుత్వం

- ఆత్మకూరులో అపరాల కొనుగోలు కేంద్రం
- మంత్రి మేకపాటి చొరవతో రైతన్నలకు తొలగిన ఇబ్బందులు



కరోనా మహమ్మారి, లాక్‌డౌన్‌ల నేపథ్యంలో జిల్లాలో రైతులు వారు పండించిన ధాన్యాన్ని విక్రయించుకునేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అండగా నిలిచింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు తమ ఉత్పత్తులను విక్రయించుకునేందుకు చర్యలు తీసుకుంటోంది. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి చొరవతో జిల్లాలోని ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ భవనాల్లో ఈ ఏడాది అపరాల కొనుగోలు కూడా ఏర్పాటు చేయడం విశేషం.

వెన్నవాడ వ్యవసాయ పరపతి సంఘం ఆధీనంలో మార్క్‌ఫెడ్ సహకారంతో పచ్చిశనగలు, మినుముల కొనుగోళ్ళు ప్రారంభమయ్యాయి. గతంలో ఈ పంటల ఉత్పత్తులను విక్రయించుకునేందుకు రైతులు అనేక ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు ముందస్తుగానే ఈ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేయడంతో ఆత్మకూరు, ఏఎస్‌పేట, అనంతసాగరం, మర్రిపాడు, చేజర్ల మండలాల రైతులు తాము పండించిన పంటలను విక్రయించుకునేందుకు పూర్తిస్థాయిలో వెసులుబాటు కలిగింది. ఈ మండలాల పరిధిలో సుమారు 20 వేల ఎకరాల్లో అపరాలు సాగయ్యాయి. తొలివిడతగా వచ్చిన పచ్చిశనగ కొనుగోళ్ళు ప్రారంభం కావడం, ఈనెల 18వ తేది నాటికి 5,550 క్వింటాళ్ళు కొనుగోలు చేయడం జరిగింది. క్వింటాలుకు 4,875 రూపాయల లెక్కన కొనుగోలు చేస్తున్నారు. ఇందుకు ఆయా రైతులకు మొత్తం 2.63 కోట్ల రూపాయలకు పైగానే నగదును ప్రభుత్వం ఆయా రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు సమాచారం. అంతేకాక అపరాలు సేకరించేందుకు రైతులకు గోతాలు ఇస్తున్నారు. త్వరలో జొన్న, మొక్కజొన్న కొనుగోళ్ళు కూడా ప్రారంభించనున్నారు. గతంలో పంటలు చేతికి వచ్చాక వాటిని విక్రయించుకునేందుకు దళారుల కోసం ఎదురుచూడాల్సి వచ్చేదని, దళారులు అడిగిన ధరకే తమ ఉత్పత్తులను ఇవ్వాల్సివచ్చేదని, ఇప్పుడా పరిస్థితి లేదని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక ఆత్మకూరులో అపరాల కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేయడంతో అక్కడ గిట్టుబాటు ధర ఇస్తున్నారని, ఎంతో కష్టపడి పండించుకుంటున్న పంటలను సరైన సమయంలో కొనుగోలు చేయడం ద్వారా ప్రభుత్వం తమను ఎంతగానో ఆదుకుంటున్నట్లయిందని అంటూ, మెట్టప్రాంత రైతులను ఇంతగా ఆదుకునేందుకు చొరవ చూపుతున్న ప్రభుత్వానికి, మంత్రి మేకపాటి గౌతంరెడ్డికి రైతులు ఆనందంతో కృతజ్ఞతలు చెప్పున్నారు.

# లాక్‌డౌన్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

- రెడ్‌జోన్‌లో 28 మండలాలు
- జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు

కరోనా మహమ్మారి వ్యాధి నియంత్రణకు ప్రభుత్వం పెద్ద ఎత్తున చర్యలు తీసుకుంటుందని, అందుకనుగుణంగా ప్రజలు కూడా సహకరించి తప్పనిసరిగా లాక్‌డౌన్ పాటించాలని జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు చెప్పారు. లాక్‌డౌన్ నిబంధనలు పటిష్టంగా అమలయ్యేందుకు అధికారులు గట్టి చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. నెల్లూరులోని జడ్పీ సమావేశ మందిరంలో ఈనెల 20న ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కరోనా వైరస్ నియంత్రణకు జిల్లాలోని 28 మండలాలను రెడ్‌జోన్ మండలాలుగా ప్రకటించామన్నారు. కరోనా పాజిటివ్ కేసులు అధికంగా ఉండడంతో కొన్నిటిని కంటోన్మెంట్ మండలాలుగా ప్రకటించామని, రెడ్‌జోన్‌లలో లాక్‌డౌన్ నిబంధనలు కట్టుదిట్టంగా అమలుచేస్తున్నామన్నారు. గ్రీన్‌జోన్ మండలాల్లో మాత్రం ఆంక్షల సడలింపు ఉంటుందని, వ్యవసాయ పనులు, రొయ్యల విక్రయాలు, ఉపాధి పనులకు సడలింపు వర్తిస్తుందన్నారు. ప్రజలకు నిత్యావసర సరుకులు ఇబ్బంది లేకుండా చూస్తున్నామని, ప్రజలు అత్యవసరమై బయటకు వచ్చే సందర్భంలో తప్పనిసరిగా మాస్కులు ధరించాలని, సామాజిక దూరం పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ట్రూనాట్ మెషిన్ల ద్వారా పరీక్షలు చేసేందుకు జిల్లాలో 5 ల్యాబ్‌లు అందుబాటులో ఉన్నాయని, వాటి ద్వారా రోజుకు 250 పరీక్షలు నిర్వహిస్తామన్నారు. కరోనా పరీక్షలు చేసేందుకు ర్యాపిడ్ కిట్లు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఈ సమావేశంలో జేసీ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.



### వెంకటగిరిలో కట్టుదిట్టమైన చర్యలు :

శ్రీకాళహస్తి, ఏర్పేడు మండలాల్లో కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో వెంకటగిరిని రెడ్‌జోన్‌గా ప్రకటించారు. కరోనా మహమ్మారి వ్యాధి వ్యాప్తి కాకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. అంతేగాక వెంకటగిరి సమీపంలోనే ఉన్న బాలాయపల్లి మండలంలోని ఊట్లపల్లి గ్రామంలో కరోనా పాజిటివ్ కేసు నమోదైంది. దీంతో అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు. ఎక్కడికక్కడ బ్యారికేడ్లు ఏర్పాటు చేసి వీధుల్లో ఎక్కడా జన సంచారం లేకుండా చర్యలు తీసుకుంటున్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

## మాస్కుల తయారీకి

# 43వేల మీటర్ల వస్త్రం

కరోనా నేపథ్యంలో మాస్కుల తయారీకి ప్రభుత్వం 43వేల మీటర్ల వస్త్రాన్ని జిల్లాకు పంపిందని డిఆర్‌డిఏ పి.డి శీనానాయక్ తెలిపారు. నెల్లూరులోని కావేరినగర్‌లో ఈనెల 21న ఆయన మాస్కుల తయారీ వస్త్రాన్ని పరిశీలి మాట్లాడుతూ ఈ వస్త్రాన్ని కత్తిరించి ఆయా మండలాల్లోని ఎస్‌హెచ్‌జి మహిళలకు అందించి మాస్కులను కుట్టిస్తామని, ఒక్కో మాస్కు తయారీకి 3రూపాయలు చెల్లించనున్నట్లు తెలిపారు.



### జిల్లాకు వచ్చిన

# కరోనా ర్యాపిడ్ కిట్‌లు

## ఇక.. 10 నిమిషాల్లోనే వైద్య పరీక్షలు

రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు 8,816 కరోనా ర్యాపిడ్ కిట్‌లను పంపింది. దక్షిణ కొరియా నుంచి దిగుమతి చేసుకున్న ఈ ర్యాపిడ్ కిట్లు ఈనెల 20న జిల్లా వైద్యశాఖ కార్యాలయానికి వచ్చాయి. వీటికి సంబంధించి ప్రత్యేక యాప్ వచ్చిన తర్వాత పరీక్షలు నిర్వహిస్తారు. ఈ ర్యాపిడ్ కిట్‌లతో కేవలం 10 నిమిషాల్లోనే పరీక్షలు పూర్తిచేయవచ్చు. అందువల్ల వేలాది మందికి ఒకేరోజున పరీక్షలు చేసేందుకు వీలవుతుంది. వేగంగా పరీక్షలు నిర్వహించడం ద్వారా సత్ఫలితాలు ఉంటాయని, ఒకవేళ ఎవరికైనా కరోనా వైరస్ ఉంటే అలాంటివారిని గుర్తించి ఈ మహమ్మారి వ్యాధిని నివారించేందుకు సత్వర చర్యలు తీసుకోవచ్చని అధికారులు భావిస్తున్నారు.

# పేదలకు ఆహారం

## - పంపిణీ చేసిన నెల్లూరు రోటరీ క్లబ్




లాక్‌డౌన్ పూర్తయ్యే మేనెల 3వతేదీ వరకూ ప్రతీరోజూ నిరుపేదలకు ఆహారం పంపిణీ చేయనున్నామని నెల్లూరు రోటరీక్లబ్ నిర్వాహకులు కె.వి.చలమయ్య వెల్లడించారు. గత నెల 31వ తేదీ నుండి ప్రతీరోజూ నెల్లూరు ఆర్టీసీ బస్‌స్టేషన్ పక్కనున్న రోటరీ భవనంలో 200 మందికి ఆహారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. సోమవారం కూడా వారు రోటరీ భవనంలో పేదలకు ఆహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరి నుండి సహాయం కోరకుండా కేవలం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలోనే ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కె.వి.చలమయ్యతో పాటూ రోటరీ క్లబ్ కార్యదర్శి విశ్వేశ్వరరావు కూడా పాల్గొన్నారు.

## నెల్లూరు కబుర్లు

### అధికారులకు

# తలనొప్పిగా స్టోన్‌హౌస్‌పేట

ఈ లాక్‌డౌన్ సమయంలో స్టోన్‌హౌస్‌పేట జిల్లా అధికార యంత్రాంగానికి పెద్ద సమస్యగా మారింది. నగరమంతా ఒక ఎత్తయితే స్టోన్‌హౌస్‌పేట మరో ఎత్తు అయింది! లాక్‌డౌన్ అమలులో ఉన్న నేపథ్యంలో ప్రజలకు నిత్యావసరాలు కొనుగోలు చేయడానికి ప్రతిరోజు ఉదయం 6 గంటల నుండి 9 గంటల వరకు సడలింపు ఇవ్వడం తెలిసిందే! ఈ సమయం లోనే స్టోన్‌హౌస్‌పేట మెయిన్ రోడ్డు జన జాతరగా మారుతోంది. ఆత్మకూరు బస్టాండ్ సెంటర్ నుండి తడికల బజార్ సెంటర్ దాకా రోడ్డుకు ఇరువైపులా పెద్దఎత్తున ప్రొవిజన్‌షాప్‌లు, ఫ్యాన్సీషాప్‌లు ఉన్నాయి. ఈ ప్రాంతానికి నెల్లూరు నగరం చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూడా వచ్చి సరుకులు కొంటుంటారు. పలు గ్రామాలలో చిల్లర అంగళ్ళ వాళ్లు కూడా ఇక్కడికి వచ్చి హోల్‌సేల్‌గా వస్తువులు తీసుకుని పోతుంటారు. షాపు పక్కనే షాపు ఉండడంతో అన్ని చోట్ల జనం నిలబడే తీరు చూస్తే... ప్రతిరోజు ఇక్కడ ఏదో తిరునాళ జరిగినట్లుగా ఉంటుంది. ఇక్కడ జనజాతర గురించి కలెక్టర్ దృష్టికి పోవడంతో ఆయన ఇక్కడి పరిస్థితులను పరిశీలించి, ఇకముందు లాక్‌డౌన్ నిబంధనల ఉల్లంఘన జరగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించడం జరిగింది!

# తగ్గిన విద్యుత్ వినియోగం

లాక్‌డౌన్ నేపథ్యంలో జిల్లాలో విద్యుత్ వినియోగం బాగా తగ్గిపోయింది. ఎపిఎస్పీడిసిఎల్ జిల్లా సర్కిల్ పరిధిలో గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది దాదాపు 35 లక్షల యూనిట్ల విద్యుత్ వినియోగం తగ్గిందని ఎస్ఇ కె.విజయకుమార్‌రెడ్డి చెప్పారు. లాక్‌డౌన్‌తో జిల్లాలో కొన్ని పరిశ్రమలు మాత్రమే పని చేస్తున్నాయని, దీంతో వినియోగం భారీగా తగ్గిందన్నారు. అయితే ఇళ్ళకు వాడే విద్యుత్ మాత్రం పెరిగిందని చెప్పారు.

గత ఏడాది మార్చినెలలో కోటి 40లక్షల యూనిట్ల విద్యుత్ వినియోగం జరిగితే, ఈ ఏడాది మార్చి నెలాఖరుకు కోటి 5లక్షల యూనిట్ల వినియోగం జరిగిందని, గత ఏడాది 35 కోట్ల నష్టాలతో ఉన్న విద్యుత్ సంస్థకు, ఈ కరోనా మహమ్మారి వల్ల ఈ ఏడాది మరింత నష్టాలు ఎదురౌతున్నాయన్నారు.

### ఏపిఆర్ హెల్పింగ్ హ్యాండ్స్ ద్వారా..

# పోలీసులకు మాస్కుల అందజేత




నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏపీ ఆర్ హెల్పింగ్ హాండ్స్ సంస్థ చైర్మన్ సయ్యద్ నిజాముద్దీన్ ఎన్-95 మాస్క్‌లను జిల్లా ఎస్పీ భాస్కర్ భూషణ్‌కు అందజేశారు. నాణ్యమైన ఎన్-95 మాస్కులు పోలీసుల కోసం ప్రత్యేకంగా తయారు చేయించారు. వాటిపై పోలీస్, నెల్లూరు అనే అక్షరాలతో ముద్రణ చేయించారు. 350 మాస్క్‌లను జిల్లా ఎస్పీకి సోమవారం ఆయన కార్యాలయంలో కలిసి అందజేశారు. పోలీసుల పట్ల ప్రత్యేక ప్రేమతో తయారు చేయించిన ఈ మాస్కల పట్ల ఎస్పీ భాస్కర్ భూషణ్ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి కోరిక మేరకే వీటిని తయారు చేయించానని నిజాముద్దీన్ తెలిపారు.

### గృహహింసపై..

# సమాచారం ఇవ్వండి

లాక్‌డౌన్ సమయంలో ఇళ్లలో ఉన్న మహిళలు గృహహింసకు గురవుతున్నారని, దానిని నివారించేందుకు జిల్లా మహిళ, శిశు అభివృద్ధి సంస్థ ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఆ శాఖ పీడీ సుధాభారతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గృహహింసకు గురవుతున్న వారు 'దిశ' వన్‌స్టాప్ సెంటర్ (ఫోన్ 8897269216, 9848653821)కు, లేదా ఉమెన్ హెల్ప్‌లైన్ నంబర్ 181కు గానీ తెలియజేసే తక్షణ సేవలు అందిస్తామని, బాధితులకు పోలీసు రక్షణ, తాత్కాలిక వసతి, కౌన్సిలింగ్, వైద్యం మరియు న్యాయ సహాయాన్ని కూడా అందజేస్తామని ఆమె పేర్కొన్నారు.

### ప్రభుత్వాసుపత్రిలో ఖాళీలు

# భర్తీకి చర్యలు తీసుకోవాలి

నెల్లూరు ప్రభుత్వాసుపత్రిలోని(జీజీహెచ్) వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది, నాల్గవ తరగతి ఉద్యోగుల ఖాళీలను కాంట్రాక్ట్ పద్ధతిలో వెంటనే భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ యంవి శేషగిరిబాబు జీజీహెచ్ సూపరింటెండెంట్ శ్రీహరిని ఆదేశించారు. ఈనెల 19న కలెక్టర్ జీజీహెచ్‌ను తనిఖీచేసి, ఆసుపత్రిలోని ఖాళీలపై అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఖాళీలను భర్తీ చేస్తే పని భారం తగ్గుతుందన్నారు. కోవిడ్-19 టెస్టింగ్ ల్యాబ్‌కు అవసరమైన సదుపాయాలు కల్పించాలన్నారు. కరోనా రోగులకు మంచి ఆహారాన్ని అందించాలని కోరారు. క్వారంటైన్ లో ఉన్న ప్రతి ఒక్కరికీ కరోనా స్వాబ్ పరీక్షలు చేయాలని ఆదేశించారు. నుడా వైస్ చైర్మన్ బాపిరెడ్డి, డీఆర్డీఏ పీడీ శీనానాయక్ పాల్గొన్నారు.

# డ్రైవర్లకు మాస్కులు, శానిటైజర్లు

కరోనా వైరస్ నేపథ్యంలో రవాణాశాఖ ఆధ్వర్యంలో ఈనెల 18న నెల్లూరులోని పలువురు డ్రైవర్లకు మాస్కులు, శానిటైజర్లు పంపిణీ చేశారు. నెల్లూరు నగరంలోని మద్రాసు బస్టాండు వద్దకు కూరగాయలను తీసుకువస్తున్న వాహనాల డ్రైవర్లకు వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంవిఐలు మాధవరావు, సునీల్‌రెడ్డి, బాలకృష్ణ, భాస్కరరావు, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్‌కు 2 లక్షల విరాళం

కరోనా వైరస్ నియంత్రణకు నెల్లూరులోని లేబర్ బీడీ పరిశ్రమ యాజమాన్యం వారు ఈనెల 2 లక్షల రూపాయలు విరాళం ప్రకటించారు. ఆ పరిశ్రమ యాజమాన్యం తరఫున ఎస్‌కె షాహీద్, ఎస్‌కె కరీముల్లాలు ఈనెల 18న ఆ విరాళం చెక్కును నెల్లూరులోని జడ్పీ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబును కలిసి అందజేశారు.

# వైయస్ జగన్‌కు కృతజ్ఞతలు

కరోనా మహమ్మారిపై పోరాటంలో మరణించిన పోలీసులకు ఎక్స్‌గ్రేషియా వర్తింపజేస్తున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రకటించడం పట్ల రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం గౌరవ సలహాదారుడు వై.శ్రీహరి సంతోషం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతపురం జిల్లా హిందూపురంలోని ఏఎస్ఐ కరోనాతో మృతిచెందడం దురదృష్టకరమని ఆయన పేర్కొంటూ, ఆ ఏఎస్ఐ కుటుంబాన్ని ఆదుకుంటూ ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన ముఖ్యమంత్రికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

### వియస్‌యు దినసరి ఉద్యోగులకు

# నిత్యావసర సరుకులు




నెల్లూరులోని విక్రమ సింహపురి యూనివర్సిటీలో పనిచేసే దినసరి వేతన ఉద్యోగులకు, సెక్యూరిటీ సిబ్బందికి వైస్‌ఛాన్సలర్ ఆర్.సుదర్శనరావు బియ్యం, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. సోమవారం జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో వారికి 10 కేజీల బియ్యం, 8 రకాల నిత్యావసర సరుకులు, కూరగాయలు అందజేశారు. లాక్‌డౌన్‌తో దినసరి వేతన ఉద్యోగులు, సెక్యూరిటీ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని దాన్ని దృష్టిలో ఉంచుకుని వారికి వీటిని పంపిణీ చేసినట్లు వైస్‌ఛాన్సలర్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాక్‌డౌన్‌తో అందరితో పాటూ యూనివర్శిటీలో పనిచేసే దినసరి వేత ఉద్యోగులు, సెక్యూరిటీ సిబ్బంది కుటుంబాలు ఎంతో ఇబ్బంది పడుతున్నాయని, వారికి యూనివర్శిటీ బాసటగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. విపత్కర సమయంలో కూడా ఎంతో కష్టపడి నెల రోజులుగా జిల్లాలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్న జాతీయ సేవా పథకం కార్యక్రమ అధికారులను, వాలంటీర్లను అభినందించారు.

అనంతరం యూనివర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్.విజయకృష్ణారెడ్డి కరోనా వైరస్‌పై వారికి అవగాహన కల్పించి పలు జాగ్రత్తలు చెప్పారు. ఆయన కూడా వస్తువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం జిల్లా సమన్వయకర్త డాక్టర్ ఉదయ్ శంకర్, ప్రోగ్రాం ఆఫీసర్ విజయ కుమార్, కృష్ణ చైతన్య డిగ్రీ కళాశాల ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు, ఎన్.సి.సి క్యాడెట్లు పార్థసారధి, రాజేష్, శివరాజ్, చైతన్య, అఖిల్, కావ్య, జోత్స్న పాల్గొన్నారు.

# పేదలను ఆదుకుంటున్న మంత్రి అనిల్

## - సొంత నిధులతో 9500 పేద కుటుంబాలకు కూరగాయలు




కరోనా మహమ్మారి వ్యాధి, లాక్‌డౌన్ నేపథ్యంలో తన నియోజకవర్గంలోని పేదప్రజలు ఇబ్బందులు పడకుండా రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి డాక్టర్ పి.అనిల్ కుమార్‌యాదవ్ తన సొంత నిధులతో 46 టన్నుల కూరగాయలను, 10వేల నూనె ప్యాకెట్లను అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ కష్టకాలంలో పేదలకు తాను అండగా ఉన్నానంటూ తనవంతుగా మంత్రి అనిల్ మానవత్వంతో పేదలను ఆదుకుంటూ అందరి అభినందనలు అందుకుంటున్నారు.

ఈనెల 20న మంత్రి నెల్లూరు నగర నియోజకవర్గంలోని 5వ డివిజన్‌లో 1100, 52వ డివిజన్‌లో 2,500, 45వ డివిజన్‌లో 1,350, 44వ డివిజన్‌లో 500, 47వ డివిజన్‌లో 1000, 50వ డివిజన్‌లో 1250, 14వ డివిజన్‌లో 600, 42వ డివిజన్‌లో 500, 16వ డివిజన్‌లో 700 కుటుంబాలకు వలంటీర్ల ద్వారా కూరగాయలు, నూనె ప్యాకెట్లను అందజేశారు. మంత్రి అనిల్ ఈ కార్యక్రమాన్ని పరిశీలించారు. వైయస్సార్సీపి నాయకులు ఓబిలి రవిచంద్ర, రమేష్, మైనుద్దీన్, బివికె, దార్ల వెంకటేశ్వర్లు, నీలి రాఘవరావు, శివపురం సురేష్, శివకుమార్‌ఆచారి, మజ్జిగ జయకృష్ణారెడ్డి, కొణిదల సుధీర్, కర్తం ప్రతాప్‌రెడ్డి, ఎస్‌ఆర్ ఇంతియాజ్, వేనాటి శ్రీకాంత్‌రెడ్డి తదితరులు కూరగాయలు, నూనె ప్యాకెట్లను సచివాలయాలకు అందజేశారు.

# నిరుపేదల కోసమే.. 'జగనన్న కానుక'

## కిలివేటి సంజీవయ్య ఆదర్శం అభినందనీయం - మంత్రి అనిల్ ప్రశంస



కరోనా మహమ్మారి, లాక్‌డౌన్‌ల నేపథ్యంలో నిరుపేదలను ఆదుకోవాలనే ఉద్దేశంతో 'జగనన్న కానుక' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఎంతో అభినంద నీయుడని, ఇంతటి మంచి కార్యక్రమాన్ని చేపట్టి ఆయన అందరికీ ఆదర్శంగా నిలిచారని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్ ప్రశం సించారు.

ఈనెల 20న నాయుడుపేటలోని ఏఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఈ కార్యక్ర మాన్ని మంత్రి అనిల్, రాజ్యసభసభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిల చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అనిల్ మాట్లాడుతూ దాతలు అందించిన సుమారు రెండుకోట్ల రూపాయల విలువైన సాయాన్ని సూళ్ళూరుపేట నియోజకవర్గం లోని 90వేల పేద కుటుంబాలకు అంద జేసే జగనన్న కానుక కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కిలివేటి ప్రారంభించడం, పేదలకు కూర గాయలు, నిత్యావసర సరుకులు, పండ్లు వగైరాలను అందించేందుకు కృషి చేయడం ఎంతో సంతోషదాయకమని అన్నారు. రాష్ట్రంలో కరోనా మహమ్మారి నియం త్రణకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఎంతో పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారని, ముఖ్యమంత్రి ఆదేశాలే శిరోధార్యంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు అందరం కలసి పనిచేస్తున్నా మన్నారు. రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ పేదలను ఆదు కునేందుకు ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఇలాంటి బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం ఆదర్శనీయమన్నారు.

ఎమ్మెల్యే కిలివేటి మాట్లాడుతూ ముఖ్య మంత్రి ఇచ్చిన పిలుపుతో తాము ఈ సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని, దాతల ఔదార్యంతో పేదలను ఆదుకుంటున్నామని చెప్పారు. అనంతరం నియోజకవర్గంలోని ఆరు మండలాలకు సరుకుల తరలింపును జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్ర మంలో ఆర్డీఓ సరోజిని, కమిషనర్ చంద్ర శేఖర్‌రెడ్డి, నాయకులు కామిరెడ్డి సత్య నారాయణరెడ్డి, కట్టా సుధాకర్‌రెడ్డి, కట్టా వెంకటరమణారెడ్డి, తంబిరెడ్డి సుబ్ర హ్మణ్యంరెడ్డి, 786 రఫీ పాల్గొన్నారు.

# ర్యాపిడ్ టెస్ట్ కిట్‌లను సద్వినియోగం చేసుకోండి

## - వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి గౌతమ్‌రెడ్డి




ఒక్క గంటలోనే కరోనా వ్యాధిని నిర్ధారించే ర్యాపిడ్ 2,500 ర్యాపిడ్ టెస్ట్ కిట్‌లు జిల్లాకు వచ్చాయని, ఈ కిట్‌లను సద్వినియోగం చేసుకుని కరోనా పరీక్షలు నిర్వహించి ఫలితాలను రాబట్టాలని రాష్ట్ర పరిశ్రమల మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి జిల్లా అధికారులకు సూచించారు. ఈనెల 18న ఆయన విజయవాడ నుంచి నెల్లూరు జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఐసొలేషన్ వార్డుల్లో వైద్య సేవలు పొందుతున్న వారి ఆరోగ్య పరి స్థితులు ఎలా ఉన్నాయో ఆయన ఈ సంద ర్భంగా అధికారులను అడిగి తెలుసుకు న్నారు. క్వారంటైన్‌లో ఉన్న వారికి సక్ర మంగా ఆహారం, వైద్యపరీక్షలు అందజే యాలని మంత్రి సూచించారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది కరోనా వైరస్‌పై ప్రజలకు పూర్తిస్థాయిలో అవ గాహన కల్పించాలన్నారు.

### ధాన్యం కొనుగోళ్ళు వేగవంతం చేయాలి :


జిల్లాలో ధాన్యం కొనుగోళ్ళను వేగ వంతం చేసి రైతులను ఆదుకోవాలని, వరిపంటను ఆలస్యంగా కోసిన రైతులు ఇబ్బందులు పడకుండా వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని మంత్రి ఈ సంద ర్భంగా అధికారులను ఆదేశించారు. అదేవిధంగా కూరగాయల రైతులు కూడా నష్టపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటిదాకా 1.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, ఇంకా 1.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ట్రైనీ కలెక్టర్ కల్పనాకుమారి, డిఆర్‌ఓ మల్లి కార్జున, నుడా వైస్‌ఛైర్మెన్ బాపిరెడ్డి, నెల్లూరు నగర పాలకసంస్థ కమిషనర్ పివివిఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# స్వగ్రామంలో మెట్టుకూరు దాతృత్వం



జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మాజీఛైర్మెన్ మెట్టుకూరు ధనంజయరెడ్డి లాక్‌డౌన్ మూలంగా ఎన్నో ఇబ్బందులు పడుతున్న తన సొంత ఊరి ప్రజలకు చేయూతనందించాడు. ఈ నెల 19వ తేదీన అనంతసాగరం మండలం లింగం గుంటలోని 350 కుటుంబాలకు 1500 చొప్పున ఆర్థిక సహాయం అందించారు. కరోనా వైరస్ వ్యాప్తి కారణంగా ప్రభుత్వం లాక్‌డౌన్ విధించడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో జీవన ఉపాధి కోల్పోయి ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులకు ఆర్థిక సహాయం అందించి మెట్టుకూరు చేయూతనిచ్చారు. ఆదివారం మెట్టుకూరు ధనంజయ రెడ్డి సోదరుడు మెట్టుకూరు విజయభాస్కర్‌రెడ్డి, మెట్టుకూరు సుబ్బారెడ్డి, ఈగ పుల్లారెడ్డి ఈ నగదును అందజేశారు. కష్ట కాలంలో ఆర్థిక సహాయం అందించిన మెట్టుకూరు ధనుంజయ రెడ్డికి గ్రామస్తులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్య క్రమంలో నారాయణ, శశి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


సంస్మరణ



కీ॥శే॥ బోగొల్లు నారాయణరెడ్డి గారు

నిర్యాణం: 23-4-1995 వర్థంతి: 23-4-2020

మా తండ్రి

బోగొల్లు నారాయణరెడ్డి గారి

25 వ వర్ధంతి సందర్భంగా

వారి పవిత్ర ఆత్మకు

శాంతి చేకూరాలని ఆశిస్తూ...

బి.మోహన్‌రెడ్డి

Architect & Engineer

Mohan Architects (P) Ltd.,

Chennai

ఫోన్: 044-24510157

మరియు

కుటుంబసభ్యులు

# సమయం లేదు మిత్రమా!

రాజైనా
బంటైనా

ప్రపంచ సుందరైనా
పరమ కురూపైనా

అధికార దురంధరుడైనా
అమాయక చక్రవర్తైనా

నంబర్ వన్ ధనవంతుడైనా
కటిక దరిద్రుడైనా

అసమాన ప్రతిభావంతుడైనా
అనామక అసమర్ధుడైనా

కరోనా అందరినీ కబళించింది
కొందరిని మట్టిలో కలిపేసింది
మిగిలున్నోళ్ళ గుండెల్లో
శోకాన్ని నింపింది

సమయం లేదు మిత్రమా.

ఇప్పుడైనా తెలుసుకో.
త్వరగా మేలుకో!

కరోనాకు కులం లేదు
కరోనా కు మతం లేదు
చిన్న పెద్ద తేడా లేదు
ఆడా మగా భేదం లేదు
ప్రాంతీయ తత్వం లేదు

సమయం లేదు మిత్రమా!

ఇప్పుడైనా తెలుసుకో!
త్వరగా బుద్ధి తెచ్చుకో!

వున్నది ఒకటే కులం.
అది మానవ కులం.

వున్నది ఒకటే మతం!
అది మానవత్వం!
కర్తవ్యం గుర్తుకు తెచ్చుకో!

కులం, మతం, జాతి, ప్రాంతం
అహంకారం, ఆధిపత్యం,
అసూయ, అసహనం,
మోసం, ద్వేషం, స్వార్థం,
తీవ్రవాదం, రక్తపాతం
అన్నింటినీ ఈరోజే వదిలేయి!

ఒక్క తాటిపై నడిచి
ఐకమత్యం తో మెలిగి
కరోనా ను తరిమెయ్!

ఇదే ఆఖరి అవకాశం మిత్రమా!

ఇప్పుడు బుద్ధి రాక పోతే!
ఇక నువ్వు నమ్మే ఆ దేవుడూ
నిన్ను రక్షించ లేదు.



- భాస్కరుని సత్య జగదీష్
హైదరాబాద్.
సెల్ : 87121 53417.

# గూడూరు డివిజన్ వార్తలు

## ఎస్‌వి రత్నం చారిటబుల్ ట్రస్ట్ సేవలు



కమిషనర్ ఓబులేసుకు మాస్కులను పంపిణీ చేస్తున్న రామ్మోహన్‌రావు

ప్రస్తుత కరోనా వైరస్ నేపథ్యంలో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు తమ వంతు సేవలు అందించడంలో గూడూరు పట్టణంలోని ఎస్.వి. రత్నం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు శ్రీకంటి రామ్మోహనరావు చేస్తున్న సేవలు అభినందనీయమని కమిషనర్ ఓబులేసు అన్నారు. ఈ నెల 21వ తేదీ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్, ఎస్.వి.రత్నం చారిటబుల్ ట్రస్ట్ అధినేత శ్రీకంటి రామ్మోహన్‌రావు కరోనా వైరస్ నివారణలో భాగంగా పారిశుధ్య కార్మికులకు మాస్క్‌లను అందజేశారు. ఇప్పటికే కరోనా సహాయనిధికి సబ్‌కలెక్టర్‌కు 50వేలు, అలాగే పారిశుధ్య కార్మికులకు మాస్క్‌లు అందజేయడం ఆయన ఉదారతకు నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్‌పీ నాయకుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## మయూరి శ్యాం దాతృత్వం

### - 40 పేద కుటుంబాలకు బియ్యం, కూరగాయల వితరణ



గూడూరులోని శ్రీకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు, మరియు అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం, నేర వ్యతిరేక సంఘాల రాష్ట్ర నాయకుడు మయూరి శ్యాంయాదవ్ దాతృత్వంతో ఈనెల 20న గూడూరులోని 33వ వార్డులో ఉన్న సుమారు 40 కుటుంబాల వారికి బియ్యం, కూరగాయలు అందజేశారు. కరోనా మహమ్మారి, లాక్‌డౌన్ నేపథ్యంలో పేదలు ఇబ్బందిపడకుండా ఈ సాయం అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గూడూరు కమిషనర్ ఓబులేశు మాట్లాడుతూ ప్రజలందరూ కరోనా మహమ్మారి వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని, సబ్బుతో తరచూ చేతులు శుభ్రపరచుకోవడం, అందరూ ఇళ్ళలోనే ఉండడం, అత్యవసర పరిస్థితుల్లో బయటకు వస్తే తప్పనిసరిగా మాస్కులు ధరించడం, సామాజిక దూరం పాటించడం తదితర జాగ్రత్తలను పాటించాలన్నారు. ఎవరికైనా జలుబు, దగ్గు, జ్వరం వస్తే వెంటనే ఆసుపత్రికి వెళ్ళి వైద్యపరీక్షలు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆనంద్, 33వ వార్డు వాలంటీర్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధికి వరిదిరెడ్డి లక్ష వితరణ



గూడూరులోని విఎస్ఆర్ రెసిడెన్సీ మరియు ప్రొవిజన్స్ స్టోర్ యజమాని వరిదిరెడ్డి సుబ్బారెడ్డి ముఖ్యమంత్రి సహాయ నిధికి లక్ష రూపాయలు విరాళం అందించారు. రాష్ట్రంలో కరోనా మహమ్మారి నియంత్రణకు ప్రభుత్వం చేస్తున్న కృషికి తోడుగా తనవంతు సాయం అందిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. లక్ష రూపాయల చెక్కును ఇటీవల గూడూరు సబ్‌కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణకు అందజేశారు.

## ప్రగతి సేవా కూరగాయల పంపిణీ



గూడూరులోని ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో బివిఎస్ఆర్ లెమన్ మర్చంట్స్, మరియు శ్రీధర్‌ల సహకారంతో స్థానిక మాలవ్యా నగర్‌లోని రెండు సచివాలయాలు, నర్సింగరావుపేట సచివాలయం పరిధిలోని 82 మంది గ్రామ వాలంటీర్లకు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు చేతుల మీదుగా కూరగాయలు పంపిణీ చేశారు. ఈనెల 20వ తేదీన ఈ కార్యక్రమం జరిగింది. ఆ సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు వేమారెడ్డి సురేంద్రనాథ్‌రెడ్డి, సహాయ కార్యదర్శి యమహా సుబ్రహ్మణ్యం, ప్రజేంద్రారెడ్డి, కరిముళ్ళ చంద్రశేఖర్, సివిఆర్ న్యూస్ ఛానల్ సతీష్, వార్డు వాలంటీర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## 20వేల మాస్కులందించిన శ్యాంప్రసాద్‌రెడ్డి



కరోనా వైరస్ నియంత్రణకు తమ వంతు సాయంగా వైకాపా జిల్లా నాయకుడు శ్యాంప్రసాద్‌రెడ్డి ఈనెల 17న 20 వేల మాస్కులను జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరి బాబుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా వైరస్ నియంత్రణకు జిల్లా అధికార యంత్రాంగం ఎంతగానో శ్రమిస్తున్నారని, ఈ తరుణంలో తనవంతు బాధ్యతగా ఈ మాస్కులను అందజేస్తున్నానని అన్నారు. కరోనా మహమ్మారి బారిన పడకుండా అందరూ మాస్కులు ధరించాలని, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు పాటించి కరోనాను ఎదుర్కోవాలని ఆయన అన్నారు.

## సేవకు ప్రతిరూపంగా చేగువేరా ఫౌండేషన్



గూడూరు మండలం అయ్యవారిపాలెం, మేకనూరు గ్రామాల్లో ఎస్‌టి, ఎస్సీ కాలనీలో 150 కుటుంబాలకు చేగువేరా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, వైయస్సార్ కాంగ్రెస్ యువనేత మండ్ల సురేష్‌బాబు, గూడూరు తహశీల్దార్ లీలారాణి చేత నిత్యావసర సరుకులను, కూరగాయలను ఈనెల 21న పంపిణీ చేశారు. ప్రభుత్వం విధించిన లాక్‌డౌన్‌లో ఏ ఒక్కరూ ఇబ్బంది పడకుండా వుండాలన్నారు. వీఆర్‌వో రాజేష్, గ్రామ కార్యదర్శి పర్యవేక్షణలో చేగువేరా సభ్యులు ఇంటింటికి వెళ్ళి నిత్యావసర సరుకులు, కూరగాయలు పంపిణీ చేశారు. క్రాంతికుమార్, మధురెడ్డి, వినోద్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## మహిళా మండలి మాస్కులు



గూడూరులోని ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు దాత రామకృష్ణారెడ్డి సహకారంతో ఈనెల 19న 200 మాస్కులను గూడూరు పురపాలక కమిషనర్ ఓబులేశుకు అందజేశారు. కరోనా మహమ్మారి వ్యాధి వ్యాప్తి నియంత్రణకు తమవంతుగా ఈ సాయం అందజేశారు. ఆంధ్రమహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి, క్లబ్ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పేదలకు 5 వేలు ఇవ్వాలి

### - పాశం నిరాహార దీక్ష



కరోనా మహమ్మారి, లాక్‌డౌన్‌ల నేపథ్యంలో పేదప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రతి ఒక్క కుటుంబానికి 5వేల రూపాయల ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ గూడూరు మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఇటీవల నిరాహార దీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు నాయకులు బిల్లు చెంచురామయ్య, వాటంబేడు శివకుమార్ పాల్గొన్నారు.



గూడూరు పట్టణంలో డ్రోన్ కెమరాతో రెడ్‌జోన్‌ను పరిశీలిస్తూ కెమెరాలో ఉన్న మైకులు ద్వారా ప్రజలకు రెడ్‌జోన్ నిబంధనలను తెలియచేస్తున్న పట్టణ సి.ఐ దశరధరామారావు, ఎస్ఐ సైదులు, పోలీసు సిబ్బంది.

## వెంకటాచలం, బుచ్చి టోల్‌ప్లాజాల వద్ద

# ముమ్మరంగా తనిఖీలు

కరోనా మహమ్మారి వ్యాధి వ్యాప్తి నివారణలో భాగంగా, లాక్‌డౌన్ అమలు నేపథ్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న టోల్‌ప్లాజాల వద్ద జిల్లా అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ వాహనాలను పరిశీలిస్తున్నారు. నిత్యావసర సరుకులు, కూరగాయలు తరలించే వాహనాల్లో ఇతర ప్రాంతాల నుంచి ప్రజలు అక్రమంగా ప్రయాణిస్తున్నారన్న సమాచారంతో జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. జిల్లాలోని సరిహద్దు ప్రాంతాలు, టోల్‌ప్లాజాలపై ప్రత్యేకదృష్టి పెట్టారు. కావలి ప్రాంతంలో లారీలో వెళుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. చెన్నై నుంచి వస్తున్న మూడు ద్విచక్రవాహనాలను గుర్తించి వాటిపై ప్రయాణిస్తున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని క్వారంటైన్‌కు తరలించారు. ఈనెల 17న జిల్లా ఏఎస్పీ(క్రైం) మనోహర్‌రావు వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు చేసి పలు వాహనాలను సీజ్‌చేశారు. వాహనచోదకులకు లాక్‌డౌన్‌పై అవగాహన కలిగించారు. ఏఎస్సైలు రహీం, అబ్రహాంతో పాటు పోలీసు సిబ్బంది ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.

అదేవిధంగా బుచ్చిరెడ్డిపాళెంలోని టోల్‌ప్లాజా వద్ద బుచ్చి సిఐ సురేష్‌బాబు, ఎస్‌ఐ జిలానీ పోలీసు సిబ్బందితో కలిసి వేకువన 5 గంటలకే టోల్‌ప్లాజా వద్దకు చేరుకుని వాహనాల తనిఖీలను నిర్వహించారు. అనుమతి లేని 15 వాహనాలపై కేసులు నమోదు చేశారు. మరో 15 వాహనాల యజమానులకు 22వేల రూపాయలు జరిమానా విధించారు. లాక్‌డౌన్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, అత్యవసరమైన సమయాల్లో బయటకు వస్తే తగు నిబంధనలు పాటించాలని వారు స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా చిత్తం వచ్చిన రీతిలో వాహనాల్లో రాకపోకలను సహించేది లేదన్నారు.

## రూ.5 లక్షల విరాళాలతో

# నిత్యావసర సరుకులు

నెల్లూరు జిల్లా విడవలూరు మండలంలోని 15 పంచాయితీల్లో రేషన్ కార్డులు లేని వారికి నిత్యావసర సరుకులు, బియ్యం ఇచ్చేందుకు ఇప్పటి వరకు రూ.5 లక్షల విరాళాలు ఇచ్చినట్లు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. ఈనెల 19న ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తన తండ్రి నల్లపరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ నుంచి రూ.2 లక్షలు, డీసీఎంఎస్ ఛైర్మన్ వీరి చలపతి రూ.లక్ష, ఆప్కాబ్ ఛైర్మన్ కొండూరు అనిల్‌బాబు రూ.లక్ష, ఆదిశంకర విద్యాసంస్థలు రూ.లక్ష విరాళంగా అందజేసినట్లు తెలిపారు.

రూ.5 లక్షల చెక్కులను వైయస్సార్ సీపీ మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్ రెడ్డికి అందజేసినట్లు తెలిపారు. దాతల సహకారంతో దాదాపు రూ.9 లక్షలతో ఈనెల 24న విడవలూరులో నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తామన్నారు.

## సర్వేపల్లి రిజర్వాయర్ నుంచి

# సాగునీటి విడుదల

వెంకటాచలం మండలంలోని సర్వేపల్లి రిజర్వాయర్ నుంచి చెరువులకు నీళ్ళు విడుదలయ్యాయి. ఈనెల 17న సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నీళ్ళను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రెండవ పంటకు సాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అధికారులు, రైతులు సమన్వయంతో కలసి పనిచేయాలని, ఒక్క ఎకరా కూడా ఎండిపోకుండా చివరి ఆయకట్టు వరకు సాగునీళ్ళందించే బాధ్యత తనదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఇ.ఇ కృష్ణమోహన్, ఏ.ఇ ప్రసాద్, విజయభాస్కర్‌రెడ్డి, డిసిసిబి మాజీఛైర్మన్ వేమారెడ్డి శ్యాంసుందరరెడ్డి, వైయస్సార్సీపి నాయకులు ఎం.వెంకటశేషయ్య, కనుపూరు కోదండరామిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వేమారెడ్డి రఘునందన్‌రెడ్డి, టి.చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రార్థనలు ఇళ్ళలోనే జరుపుకోండి

ముస్లింలు ఎంతో పవిత్రంగా భావించే రంజాన్ మాసం ఈనెల 24 నుంచి ప్రారంభమవుతుందని, పండుగను ఇళ్ళలోనే జరుపుకోవాలని జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి సయ్యద్ అబ్దుల్ హమీద్ ఈనెల 17న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రోజువారీ నమాజులు, ప్రార్థనలు అన్నీ ఇళ్ళలోనే నిర్వహించుకోవాలని సూచించారు. కరోనా మహమ్మారి వ్యాధి వ్యాప్తి నివారణలో భాగంగా, లాక్‌డౌన్ నేపథ్యంలో సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్ వారు ఈ విషయాన్ని తెలియపరిచారని ఆయన పేర్కొన్నారు.

గల్పిక

# ప్రపంచ దేశాధినేతలతో చంద్రబాబు భేటి

అది హైటెక్ రత్న చంద్రబాబు నాయుడు తన రక్తాన్ని స్వేదంగా మార్చి ఇటుక, ఇసుక, సిమెంటు, కంకర తెచ్చి కట్టించిన భాగ్యనగరం. జూబ్లీహిల్స్‌లోని విశాల మైన రహదారిపై అప్పుడే యంగ్ లయన్ నారా లోకేష్, మాస్టర్ టైగర్ దేవాన్ష్ హల్‌చల్ చేస్తున్నారు. దేవాన్ష్ స్కేటింగ్ చేస్తుంటే లోకేష్ సైకిల్ తొక్కుతున్నాడు. అలా రోడ్డుమీద కొద్దిదూరం పోగానే పోలీసులు అడ్డుకున్నారు. ఇది కరోనా వైరస్ సీజన్, బయట తిరగడానికి లేదు. బుద్ధిగా ఇంట్లో ఉండండి, అంతగా పాలుపోకుంటే ఇంట్లో వంట చేస్తూనో, బట్టలు ఉతుకుతునో, అంట్లు తోముకుంటూనో సరదాగా గడపండి, బయటకి మాత్రం రాకండి అని హెచ్చరించారు. దానికి, లోకేష్... ఇంట్లో ఆ పనులు చేయలేకే అప్పుడప్పుడు బయటికి వస్తున్నాము, మళ్లీ మీరేమో లోపలికెళ్లి పనులు చేయమంటారేంటి అని కోప్పడ్డాడు. అందుకు వారిలో ఒక పోలీసు ఉండి... మీకు ఇంట్లో పనులు చేయడం ఇష్టం లేకపోతే, ఏవైనా స్నాక్స్ తింటూ టీవీలో సినిమాలు చూస్తూ గడపండి అని సలహా ఇచ్చాడు. ఆ మాటకు లోకేష్‌కు అరికాళ్ళలో మండింది. ఇంట్లో పొద్దస్తమానం కూర్చుని తింటుంటే.. ఇంట్లో వాళ్ళు ఏమో ఇలా 24 గంటలు ఇంట్లో కూర్చొని తిన కుంటే.. అలా బయటకి వెళ్లి సైకిల్ తొక్కుకోవచ్చు కదా, ఒళ్లైనా కరుగుతుంది అని కసురుకుంటున్నారు... వాళ్ళ పోరు పడలేక బయటకు వస్తే మీరేమో ఇళ్ళల్లోకి వెళ్లి ఉండొచ్చు కదా అని భయపెడుతున్నారు. మీకు.. ఇంట్లో వాళ్లకు మధ్యలో మేము నలిగిపోతున్నాం! అని రుసరుసలాడుతూ తిరిగి ఇంట్లోకి వచ్చేసాడు.

ఇంట్లో అడుగు పెట్టగానే అక్కడున్న వాతావరణాన్ని చూసి లోకేష్ ఒక్కసారిగా షాక్ తిన్నాడు. భువనేశ్వరిదేవి, బ్రాహ్మణితోపాటు తెలుగుదేశం నాయకులు దేవినేని ఉమామహేశ్వరరావు, పత్తిపాటి పుల్లారావు, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, బుద్ధా వెంకన్న, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, పి.నారాయణ, ఎలమంచిలి బాబు రాజేంద్రప్రసాద్ తదితరులు అక్కడ కూర్చుని ఉన్నారు. అందరి మొహాల్లోనూ ఆందోళన కనిపిస్తోంది. లోకేష్‌కు ఏదో జరగరానిది జరిగిందనిపించి, కొంచెం ముందుకెళ్ళి ఏమైంది అంకుల్ అంటూ గోరంట్ల బుచ్చయ్యచౌదరిని కదిలించాడు. బుచ్చయ్య చౌదరి అటు చూడు... అంటూ ఓ వైపు చూపించాడు. లోకేష్ అటు చూస్తే... అక్కడ చంద్రబాబునాయుడు కూర్చుని ఉన్నాడు. ఆయన చెవిలో ఐఫోన్ సెల్ ఫోన్ ఉంది. ఆయన ఫోన్లో హలో డోనాల్డ్ ట్రంప్.. హౌ ఆర్ యు... మీ దేశంలో కరోనా వైరస్ పరిస్థితి ఏమిటి, ఒక నెల ముందుగా నాకు ఫోన్‌చేసి ఇలా అడుగుంటే అసలు మీ దేశంలో ఒక్క కేసు రాకుండా ఉండేవిధంగా సలహా ఇచ్చి ఉండే వాడిని కదా! మీరు బాగా లేట్ అయ్యారు. నన్ను సంప్రదించక పోవడంతో మీ దేశంలో కరోనా వైరస్ కేసులు పెరిగాయి. ఇప్పటికైనా మించి పోయింది లేదు. మీరు వెంటనే 'కరోనాపై కత్తి యుద్ధం' అనే స్క్రిప్ట్‌తో యాక్షన్‌ప్లాన్ మొదలు పెట్టండి. పబ్లిసిటీ పీక్స్‌లో ఉండాలి, ప్రతి టౌన్‌లోనూ దీనికి సంబంధించి ఫ్లెక్సీలు వేయించండి, ప్రతి ఫ్లెక్సీ మీద మీ ఫోటోతో పాటు నా ఫోటో కూడా ఉండేలా చూడండి, గంటకొకసారి ప్రెస్‌మీట్‌లు పెట్టండి, రోజుకి ఓ పాతిక మంది అధికారులను సస్పెండ్‌చేస్తూ ఉండండి, అప్పుడప్పుడు కోవిడ్-19 ఆసుపత్రులకు ఆకస్మిక తనిఖీలకు వెళ్లండి, అప్పుడు ఆటోమేటిక్‌గా కరోనా వైరస్‌పై మీరు సమర్థవంతంగా పోరాటం చేస్తున్నారని పేరొస్తుంది.. అని సలహా ఇచ్చాడు. చంద్రబాబుకు ట్రంప్ కృతజ్ఞతలు చెప్పి ఫోన్ పెట్టేశాడు.

ట్రంప్ ఫోన్ పెట్టడం అయిపోగానే, మళ్లీ చంద్రబాబు ఫోన్ మోగింది. ఈసారి అవతల్నుండి బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్. నమస్తే.. చంద్రబాబు సార్! ఈరోజు నేను కరోనా వైరస్ నుంచి కోలుకుని కేసీఆర్ చెప్పినట్లు బతికి బలుసాకు తింటూ ఉన్నానంటే మీరు ఇచ్చిన సలహాలే కారణం, మీ సూచనలు, సలహాలు పాటించబట్టే నేను ఐసోలేషన్ వార్డు నుంచి క్షేమంగా బయటకు రాగలిగాను. అంతా మీ దయ. జీవితాంతం మీరు చేసిన మేలును మరిచిపోను అని చెప్పి పెట్టేసాడు.

కొద్దిసేపటికి రష్యా ప్రధాని పుతిన్ ఫోన్ చేశాడు. నమస్కారం చంద్రబాబు గారు! మా దేశంలో కరోనా వైరస్ కేసులు తక్కువగా నమోదు కావడానికి మీరిచ్చిన సూచనలే కారణం. భవిష్యత్తులో కూడా మాకు ఇలాంటి విపత్తు ఎదురైనప్పుడు మీరే గుర్తుకు వస్తారు. మీ మేలు ఈ జన్మలో మర్చిపోను, ఉంటాను సార్ అని చెప్పి ఫోన్ పెట్టేశాడు. ఆ తర్వాత కొద్ది సేపటికి ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహూ, జపాన్ ప్రధాని షింజో అబే, జర్మనీ ఛాన్సలర్ ఏంజెల్ మోర్కెలా, పాకిస్థాన్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌లు కూడా చంద్రబాబుకి వరుసగా ఫోన్లు చేసి కృతజ్ఞతలు తెలిపారు. అందరికంటే చివరగా భారత ప్రధాని నరేంద్ర మోదీ బాబుకు కాల్ చేశారు. ఆయన బాబుతో.. చంద్రబాబు గారు ఇలాంటి కీలక సమయంలో మీలాంటి అనుభవజ్ఞుడైన సీఎం లేక ఏపీ ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. అసలు మీరు అధికారంలో ఉండి ఉంటే కరోనా వైరస్ యాంటీ స్క్వాడ్ ఒక దానిని ఏర్పాటు చేసి, దానికి మిమ్మల్ని ఛైర్మన్‌గా పెట్టేవాడిని. మీ సలహాలు, సూచనలు లేకపోవడం వల్లే భారతదేశంలో వైరస్ పాజిటివ్ కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఈ వైరస్ వెలుగు చూసిన మొదటిరోజే మేము మిమ్మల్ని సంప్రదించి ఉంటే ఈ ఉపద్రవం నుండి బయటపడడానికి మీరు ఏదో ఒక మార్గం చూపించే వాళ్ళు. మీ సలహాలు తీసుకోవడంలో చాలా ఆలస్యమైంది. చేసిన పాపానికి ఈరోజు దేశం భారీగా నష్టపోవాల్సి వచ్చింది. కరోనా వైరస్‌ను పారద్రోలే యజ్ఞంలో మీ భాగస్వామ్యం అత్యంత అవసరం. కాబట్టి, మీకు గంట గంటకి ఫోన్ చేస్తుంటాను, నేను విసిగిస్తున్నాను అని ఏమీ అనుకోవద్దు. ఇది దేశ ప్రజల ప్రాణ రక్షణ కోసమే. దయచేసి నా కోరికను కాదనకండి అని అభ్యర్థించాడు. దానికి చంద్రబాబు తప్పకుండా చేస్తానని హామీ ఇచ్చారు. మోడీ మనస్ఫూర్తిగా ఆయనకు కృతజ్ఞతలు తెలుపుకుని ఫోన్ పెట్టేసాడు.

ఇదంతా చూసిన లోకేష్ అవాక్కయ్యాడు. తన తల్లి భువనేశ్వరిదేవిని పక్కకు పిలిచి ఏంటమ్మా ఇదంతా ట్రంపు, బోరిస్ జాన్సన్, మోడీ లాంటి వాళ్ళు ఎంతో మేధావినైన నాకే ఫోన్ చేయరు, అలాంటిది నాన్నకు ఫోన్‌చేసి మాట్లాడడం ఏంటి, నాకు అంతా వింతగా ఉంది.... అని తన సందేహాన్ని వెలిబుచ్చాడు. భువనేశ్వరి నాయనా నీ సందేహం నిజమే! వాళ్ళు ఎవరు మీ నాన్నకు ఫోన్ చేయలేదు, ఇప్పుడు మీ నాన్నతో ఫోన్‌లో మాట్లాడిన వాళ్లంతా మిమిక్రీ ఆర్టిస్టులు, ట్రంప్, బోరిస్ జాన్సన్, బెంజిమన్ నెతన్యాహూ, మోడీల గొంతును అనుకరించి మాట్లాడారు అని చెప్పింది. దానికి లోకేష్.. డూప్లికేట్ వాళ్లతో నాన్నతో మాట్లాడించాల్సిన అవసరం ఏంటి? ఇది నాన్నను చీట్ చేయడం కాదా! అని అడిగాడు. దానికి భువనేశ్వరి ఇది ఛీటింగ్ కాదు.. మీ నాన్న ఆరోగ్యం కోసం నేను పడుతున్న తపన అని అంది. ఆయన ఆరోగ్యం కోసం ఇలా మిమిక్రీ ఆర్టిస్టులతో డ్రామా నడపాల్సిన అవసరం ఏముందని లోకేష్ ప్రశ్నించాడు.

అప్పుడు భువనేశ్వరి రాత్రి ఏమైందో తెలిస్తే నువ్వు ఈ ప్రశ్నలు అడగవు. ఆయన తనతో ఆయా దేశాల నేతలతో పాటు భారత ప్రధాని నరేంద్ర మోదీ కూడా మాట్లాడటం లేదని, కష్టకాలంలో ఎవరు కూడా తనను గుర్తించడం లేదని తీవ్రంగా మదనపడుతున్నారు. ఈ మానసిక వేదనతోనే రాత్రి ఒంటి గంట టైంలో లేచి మోడీ ఫోన్ చేశాడు, ట్రంపు వెయిట్ చేస్తున్నాడు అని పదే పదే కలవరిస్తున్నాడు. ఉదయాన్నే లేచి మన ఫ్యామిలీ డాక్టర్‌కి ఫోన్ చేసి, రాత్రి జరిగిన విషయం చెప్పాను. దానికాయన మీ నాయన 'సోమన్యూయా పటాన్ కాంట్రవర్సీ' వ్యాధితో బాధపడుతున్నాడని... ఇది ముదిరితే ఆరోగ్యానికి ప్రమాదకరమని చెప్పాడు. దీనికి నివారణ ఏంటని నేను అడిగితే.. ఆయన ఎవరినైతే కలవరిస్తున్నాడో.. వారందరితో ఫోన్లో మాట్లాడితే ఆయన మామూలు మనిషి అవుతాడని చెప్పాడు. ఇప్పుడు వారందరితో ఫోన్లో మాట్లాడడం అయ్యేపని కాదు కాబట్టే, వారి వాయిస్‌ను అనుకరించే మిమిక్రీ ఆర్టిస్ట్‌లతో మీ నాన్నకు ఫోన్ చేసి మాట్లాడించాను. దీనివల్ల మీ నాన్న ఎంత ఉల్లాసంగా ఉన్నాడో చూడు, ఎంత ఉత్సాహంగా ఉన్నాడో చూడు... అంటూ చంద్రబాబు వైపు చూపించింది. లోకేష్ వాళ్ల నాన్న వైపు చూశాడు. అప్పుడాయన... చంద్రజ్యోతి ఎడిటర్ గోకుల నందకిషోర్‌కి ఫోన్ చేసి ఇప్పుడే ట్రంపు ఫోన్ చేశాడు, పుతిన్ ఫోన్ చేశాడు, మోడీ ఫోన్ చేసి మాట్లాడాడు అని బ్రేకింగ్ న్యూస్ వేస్కో అని చెప్పి ఫోన్ పెట్టేశాడు. ఆ సీన్ చూసి... పోతే పోనీలే... ఒక్కోసారి ఇలాంటి నాటకాలు కూడా మనుషులకు మేలు చేస్తాయి అని మనసులో అనుకున్నాడు. సరిగ్గా అప్పుడే చంద్రబాబు ఫోన్ మోగింది. చంద్రబాబు ఫోన్ ఎత్తాడు. అవతల వ్యక్తి మాట్లాడుతుండగా చంద్రబాబు కోపంతో.. నాతో వేషాలు వేస్తున్నావా, మోడీ లాగా గొంతు మార్చి మాట్లాడితే నేను కనిపెట్టలేననుకున్నావా? నీ వేషాలు నా దగ్గర కాదు, నేను ఇంతకుముందే మోడీతో మాట్లాడాను, నాతో వేళాకోళం ఆడుతూ మరోసారి నేను మోడీని, నీతో మాట్లాడాలి అని పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడావంటే మర్యాదగా ఉండదని కసిరి, ఫోన్ కట్ చేశాడు. మరు నిమిషంలో లోకేష్ ఫోన్ రింగ్ అయింది. లోకేష్ ఫోన్ ఆన్ చేశాడు. అవతల నుండి ప్రధాని నరేంద్ర మోడీ... బేటా.. ఏమైంది మీ బాబుకి నేను ఫోన్ చేస్తే ఏదేదో వాగుతున్నాడు అని అడిగాడు. ఆ పరిణామానికి లోకేష్ నోరెళ్లబెట్టి... అమ్మా! నువ్వు అరేంజ్ చేసిన డూప్లికేట్ మోడీతో బాగా మాట్లాడిన నాన్న... అసలు మోడీ ఫోన్ చేస్తే.. తిట్టి పెట్టేసాడు! అని వాపోయాడు.

# బ్రతుకుకోసం.. భృకుటిముడిచి!

- మోహన్‌దాస్ నీరుకట్టు

బతకడం కోసం కొందరు
బతికి కొందరు
చచ్చి కొందరు
చస్తూ బతకలేక
బతుకుతూ చావలేక
జీవన్మృతులై కొందరు
చావును, రేవును ఎదిరిస్తూ మరికొందరు
మృతుల స్మృతులను స్మరించుకొంటూ ఇంకొందరు
స్మరించుకునేందుకు కూడా ఎవరూ లేని అనాధ ప్రేతాలై ఎందరో...
బతుకు పోరులో ఎవరి పోరు వారిది...
చావునుంచి బతికించే పోరులో వైద్యనారాయణులకు అంతిమ ఘడియలు
కాలం సృష్టించిన విలయంలో దరిద్రనారాయణుల అక్రందన
కనిపించని శత్రువుతో పోరులో సైనికులై మరెందరో

బ్రతుకుపోరులో యాచకులై కొందరు
వీధులు బోసిబోతున్నాయ్
బతుకుతామో లేదో తెలీని
త్రిశంకుస్వర్గంలో కొందరు
నడి సంద్రంలో చుక్కాని లేని నావలో ప్రయాణీకులై....
ఎటూ తేల్చలేని మంత్రాంగం
దేశాధీశుల ఆదేశాల బకలాటంతో యంత్రాంగం
బతుకు కాలాన్ని పొడిగించే పితలాటకంలో వైద్య బృందం.....
క్షుద్బాధను తీర్చే పనిలో మహనీయులు
అన్నార్తులను ఆదుకునే బాధ్యతల్లో వదాన్యులు
ఆపన్నులను అక్కున చేర్చుకునే పనిలో భాగ్యవంతులు
దారులు బార్లా తెరుచుకున్న యమలోకపు యాత్రికులై
కిక్కిరిసిన మృత్యు శకటాల కోసం ఎదురుచూస్తూ కొందరు
రాలే తారల్లా .... మెరిసే నక్షత్రాల్లా ...
కనిపించే వెలుగుల నుంచి
సామాజిక దూరంలోనే భూస్థాపితమౌతున్న భౌతిక జీవ పదార్థాలు...
జీవిలోని లోగుట్టును కనిపెట్టలేక
ఆయువులు పటాపంచలై
మరుభూమిలో గుట్టలై....
బాహ్యప్రపంచానికి దూరమై

నెగడుల వెలుగులు విడిచిన వేల్పులు
జగన్నాథుని లీలలని కొందరు
జగమెరిగిన స్వాముల జపమాలలకు విశ్రాంతి
మూలవిరాట్టుల దయారసాన్ని
లంకె బిందెల్లో మూసేసిన జందెపుపోగుల బందీలు.....
ఎక్కడో ఉన్న తనవారికోసం
ఎప్పుడు కలుసుకుంటారో తెలీని అగమ్యగోచర స్థితి

నిన్నటి మృతులకోసం రోదిస్తూ
నేటి రోగపీడితులను శోధిస్తూ....
బాధాసర్పద్రష్టుల... శాపగ్రస్థుల...వైపు
అనుమానపు చూపులు
సమాజాన్ని నిట్టనిలువునా చీల్చిన అభద్రతా భావం

నిన్నటి రోజున అంతా నాదేనని.... రేపటికోసం మరెంతో కావాలని ...
సూదంటు రాయివై ఆకర్షించాలని...
శత్రువులని.... మిత్రులని ....
కర్మలని... క్రతువులని బ్రతుకు
చట్రంలో గిరగిరా తిరిగే బొమ్మలై ఆడి... ఓడి....
సర్వస్వం కోల్పోయిన ఓ మనిషీ

భగభగ మండే భానుడి కిరణాలతో
చెదరిపోయే తిమిరంపై
ఉషాకిరణాల సంప్రాప్తితో దృగ్గోచరమయ్యే వెలుగులకోసం ...
మునివై... తపస్వివై...యశస్వియై నడయాడు
గడపదాటి ముందుకురాకోయ్
విడివిడిగా నడయాడుతూ...
వడివడిగా కాలం విలంబనాన్ని దాటుతూ ....
ఉమ్మడి శత్రువును చెండాడే మహాయజ్ఞంలో ...
రాకాసి అదృశ్య కదలికల నిరోధానికి
జాగృతమయ్యే మానవాళి గడపలు రంగవల్లులతో విలసిల్లడంకోసం
మరో ప్రపంచపు నలుమూలలు జనసమూహం వెలుగుల్లో విరాజిల్లడం కోసం...

భగ్నమునివై నిను రక్షించుకో..
బాధ్యతతో నీ వారిని కాపాడుకో..
బహు సమూహాన్ని సంరక్షించుకో...

# కరోనా వైద్య సేవలో శ్రీసిటీ పరిశ్రమలు

**● పీపీఈ కిట్లు, ఆక్సిజన్ సిలిండర్లు, మందులు, బెడ్లు తయారీ**



కరోనావైరస్ వ్యాప్తి ప్రపంచ వ్యాప్తంగా భారీ సవాళ్లను తెచ్చిపెట్టింది. కరోనావైరస్‌ను ఎదుర్కోవడానికి జాతీయ సరిహద్దులను దాటి అన్ని దేశాలు కలిసి పనిచేస్తున్నాయి. వనరులను పంచుకుంటూ ఉమ్మడి నివారణ, నియంత్రణ విధానాలను అనుసరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పలు ఆంక్షల మధ్య, శ్రీసిటీలోని పాల్స్ ప్లష్, విఆర్వి ఆసియా పసిఫిక్, వైటల్ పేపర్ మరియు టిఐఎల్ హెల్త్‌కేర్ పరిశ్రమలు దేశానికి, రాష్ట్రానికి అవసరమైన నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ ఉత్పత్తులను తయారు చేయడంలో నిమగ్నమయ్యాయి. అధిక నాణ్యత గల 'పర్సనల్ ప్రొటెక్షన్ ఎక్విప్‌మెంట్' (పిపిఇ) కిట్‌ల మొదలు ప్రాణాలను రక్షించే మందులు, అత్యవసర ఆసుపత్రి పడకలు, వైద్య ఆక్సిజన్ సిలిండర్లు తయారౌతున్నాయి. శ్రీసిటీలోని సాఫ్ట్ టాయ్స్ తయారీ పరిశ్రమ పాల్స్ ప్లష్ ఇండియా, వైద్య సిబ్బంది మరియు కరోనా పోరాటంలో ముందు వరసలో నిలబడి పోరాడుతున్న వారి కోసం 'పర్సనల్ ప్రొటెక్షన్ ఎక్విప్‌మెంట్' (పిపిఇ) కిట్‌ల తయారీని ప్రారంభించింది. ఇది మెటల్ డిటెక్షన్ మెషీన్‌లను ఉపయోగించి ఆమోదయోగ్యమైన నాణ్యత పరిమితి ఆధారిత అంతర్గత పరీక్షా సదుపాయంతో కిట్‌లను ఉత్పత్తి చేస్తుంది. ఫేస్‌షీల్డ్‌తో సహా ఈ అధిక నాణ్యత గల పిపిఇ కిట్‌లను తయారు చేయడానికి కంపెనీ తన మొత్తం ఉత్పత్తి సామర్థ్యాన్ని వినియో గిస్తోంది. జావర్ గ్రూప్ ఆఫ్ కంపెనీల అంతర్జాతీయ ఔషధ విభాగమైన టిఐఎల్ హెల్త్‌కేర్ పరిశ్రమ శ్రీసిటీలోని తన తయారీ కేంద్రంలో ప్రాణాలను రక్షించే కొన్ని మందులతో సహా హైడ్రాక్సీ క్లోరోక్విన్ సల్ఫేట్ (హెచ్‌సిక్యూఎస్) టాబ్లెట్లను ఉత్పత్తి చేయడానికి ప్రభుత్వం నుంచి లైసెన్స్ పొందింది. వీలైనంత త్వరగా ముడి పదార్థాలు అందుకున్న వెంటనే ఉత్పత్తి పనులు ప్రారంభమ వుతాయి. కోవిడ్ -19 సంక్షోభంపై స్పందిస్తూ, చార్ట్ గ్రూప్ (యూఎస్) కు చెందిన వీఆర్వీ ఆసియా పసిఫిక్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ శ్రీసిటీలోని తన యూనిట్‌లో ద్రవీకృత ఆక్సిజన్(లాక్స్)ని నిల్వ చేయడానికి నాణ్యమైన సిలిండర్లను ఉత్పత్తి చేస్తోంది. దేశంలో కోవిడ్-19 కేసుల సంఖ్య రోజురోజుకీ ఉధృతమవుతున్న తరుణంలో, ఆసుపత్రులలో వైద్య ఆక్సిజన్ కోసం డిమాండ్ పెరుగుతోంది. ఈ డిమాండ్‌ను ఎదుర్కోవటానికి, అత్యధిక సంఖ్యలో ద్రవ ఆక్సిజన్ సిలిండర్ల అవసరం ఎంతైనా ఉంది. ఈ అత్యవసర పరిస్థితిని తీర్చడానికి, క్రయోజెనిక్ సిలిండర్లను దేశంలో కేవలం రెండే సంస్థలు తయారుచేస్తుండగా, వాటిలో ఒకటైన విఆర్వి పరిశ్రమ ఈ సిలిండర్ల తయారీకి అత్యధిక ప్రాధాన్యతనిచ్చి ముమ్మరంగా పనిని కొనసాగిస్తుంది.

బాధ్యతాయుతమైన కార్పొరేట్‌గా, దేశంలో పేరుగాంచిన అట్టపెట్టెల ప్యాకేజింగ్ మెటీరియల్ తయారీదారులలో ఒకరైన శ్రీసిటీలోని వైటల్ పేపర్స్ ప్యాకేజింగ్ విభాగం, అధిక-నాణ్యత గల క్రాఫ్ట్ పేపర్ ఆధారిత అట్టపెట్టెల బోర్డుతో అత్యంత వినూత్నమైన అత్యవసర ఆసుపత్రి పడకలను తయారు చేసి, తక్కువ ధరకు అందిస్తోంది. కరోనావైరస్ క్రిములు కాగితంపై 12 గంటలు, ప్లాస్టిక్ / లోహంపై 72 గంటల వరకు జీవించ గలవు కాబట్టి ఈ అట్టపెట్టెల బోర్డు-కాగితపు పడకలు అత్యంత సురక్షితమైనవిగా భావించవచ్చు. ఈ మంచం 7అడుగుల పొడవు, 3అడుగుల వెడల్పు, 2 అడుగుల ఎత్తు కలిగివుంటుంది. దీని బరువు సుమారుగా 16కిలోలు. ఇది చాలా సరళమైనది మరియు తీసుకువెళ్ళడానికి చాలా తేలికగా ఉంటుంది. వాటిని చాలా సులభంగా పడకలుగా ఏర్పాటు చేయవచ్చు, వాడకం తరువాత మడిచివేయవచ్చు. ఇవి వందశాతం పర్యావరణ అనుకూలమైనవి. అయితే, లాక్డౌన్ సమయంలో వివిధ రాష్ట్రాల సరిహద్దులలో ట్రక్కుల కదలికలో అడ్డంకులు కారణంగా ముడి పదార్థాలు మరియు ఇతర భాగాలను పొందడంలో తీవ్ర ఆలస్యమై, పై యూనిట్లలో కొన్నింటిలో ఉత్పత్తి పనులు దెబ్బ తిన్నాయి. ముడి పదార్థాల నిరంతరాయ సరఫరా జరిగితే, ఉత్పత్తి పూర్తి స్థాయిలో జరుగుతుంది.

శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఈ యూనిట్లను అభినందిస్తూ, మన దేశాన్ని కరోనా మహమ్మారి నుండి విముక్తి కలిగించడానికి శ్రీసిటీ పరిశ్రమలు భాగస్వామ్యులు కావడం చాలా సంతోషంగా వుందన్నారు. పౌరులకు సహాయపడే ప్రతిపనిలోను శ్రీసిటీ ఎప్పుడూ ముందుంటుందన్నారు.

## కాలధర్మం

### శ్రీమతి పొంగూరు సుబ్బమ్మ



మాజీమంత్రి, అంతకంటే ముందు నారాయణ విద్యాసంస్థల వ్యవస్థాపక ఛైర్మెన్ పొంగూరు నారాయణ మాతృమూర్తి శ్రీమతి పొంగూరు సుబ్బమ్మ ఈ నెల 23వ తేదీ గురువారం ఉదయం నెల్లూరులో కన్నుమూశారు. ఆమె వయసు 85 సంవత్సరాలు. ఆమెకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు... వీరిలో ఒక కుమార్తె దివంగతురాలైనారు. జాతీయ స్థాయిలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో సైతం తమ విద్యాసంస్థలను విస్తరింపజేసి నారాయణ సంస్థల ద్వారా లక్షలాదిమంది ఇంజనీర్లను, డాక్టర్లను, పలు రంగాల నిపుణులను సమాజానికి అందించి నెల్లూరు ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన మేధావికి జన్మనిచ్చిన పుణ్యమూర్తి సుబ్బమ్మ. ఆమె మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

### టంగుటూరు హరిశ్చంద్రారెడ్డి



టంగుటూరు చంద్రయ్యగా అందరికీ సుపరిచితుడు, టంగుటూరు సోదరులలో చివరివాడు టంగుటూరు హరిశ్చంద్రారెడ్డి తన 64వ ఏట ఏప్రిల్ 20వతేది రాత్రి కన్నుమూశాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు వున్నారు.

ఆయనకు సన్నిహితంగా వుండేవాళ్ళందరూ చంద్రయ్యా అని పిలుచుకునే ఆయన మంచి స్నేహ సంబంధాలు కలిగిన వ్యక్తి. ఇందుకూరుపేట మండలం కుడితిపాళెం స్వగ్రామం అయినప్పటికీ వ్యాపార రీత్యా నెల్లూరులో స్థిరపడిపోయింది టంగుటూరి కుటుంబం. టంగుటూరు కృష్ణారెడ్డి, రమణారెడ్డి(ఇటీవలే కాలం చేశాడు), రామిరెడ్డి, ఉదయకుమార్‌రెడ్డి చంద్రయ్య సోదరులు. కస్తూరిదేవి విద్యాలయ సంస్థల సెక్రటరీ & కరస్పాండెంట్ జె.వి.రెడ్డి సతీమణి శ్రీమతి జానకమ్మ చంద్రయ్యకి అక్క. నెల్లూరు క్లబ్ సెక్రటరీగా కూడా చంద్రయ్య పని చేశాడు. గత కొద్ది రోజులుగా అయన కాన్సర్ సంబంధిత వ్యాధితో ఇబ్బంది పడుతున్నాడు.

చంద్రయ్య మృతితో దుఃఖసాగరంలో వున్న అయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.

# బాబు సేవలో బీజేపీ అధ్యక్షులు?

***దేశంలోని అన్ని రాష్ట్రాలలో బీజేపీ నాయకులు, ఆయా రాష్ట్రాల ఆ పార్టీ అధ్యక్షులు తమ పార్టీ పురోగతి కోసమే కష్టపడుతుంటారు. తమ పార్టీ అధికారంలోకి రావాలనే కోరుకుంటుంటారు.***

యాధృచ్ఛికమో, కాకతాళీయమో కాని ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షులు మాత్రం చంద్రబాబు సేవలో తరిస్తూ, తమ పార్టీ ప్రతిష్టను మసకబారుస్తున్నారు. ఎన్నికలకు ముందు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవహరించిన కంభంపాటి హరిబాబు సంగతి తెలిసిందే! ఆయన పేరుకు బీజేపీ అధ్యక్షుడనే కాని, ఆయన చేసిన సేవంతా అప్పట్లో తెలుగుదేశం పార్టీ కోసమే! 2014-19ల మధ్య చంద్రబాబు ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అవినీతి అక్రమాలకు, వేల కోట్ల రూపాయల దోపిడీకి అడ్డాగా మారినా, ఏరోజూ ఆయన చంద్రబాబు ప్రభుత్వాన్ని వేలెత్తి చూపలేదు. ఎన్నో సందర్భాలలో చంద్రబాబు ప్రభుత్వ అవినీతి అక్రమాలను సమర్ధించారు. అప్పట్లో రాష్ట్ర బీజేపీ నాయకులు బహిరంగంగానే హరిబాబు వ్యవహారంపై అమిత్‌షాకు ఫిర్యాదు చేశారు కూడా!

ఎన్నికలకు ముందు కన్నా లక్ష్మీనారాయణను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించడం తెలిసిందే! ఎన్నికల సమయంలో కొంత అటూ ఇటూగా వున్న కన్నా లక్ష్మీనారాయణ, ఇటీవలకాలంలో వైసిపి ప్రభుత్వం మీద, ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి మీద అక్కసు వెళ్లబోసుకుంటున్నాడు. ఒకప్పటి కాంగ్రెస్ నేత అయిన కన్నా ఆ పార్టీ బుద్ధినే చూపిస్తున్నాడు. బీజేపీ క్రమశిక్షణ గల పార్టీ. కాంగ్రెస్‌లా అల్లరి చిల్లర పార్టీ కాదు. ఆ పార్టీ నాయకులు మాట్లాడే విధానం కూడా పద్ధతిగా వుంటుంది. చేసే విమర్శలు, ఆరోపణల్లో కూడా సహేతుకత వుంటుంది. కాని కన్నాకు బీజేపీ క్రమశిక్షణ ఇంకా అలవడినట్లు లేదు. రాష్ట్ర ప్రభుత్వంపై లేనిపోని అభాండాలు వేస్తున్నాడు. ఓ పక్క కరోనా కట్టడికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమే అభినందిస్తోంది. ఇక్కడ చూస్తే అదే పార్టీ అధ్యక్షుడికి నచ్చడం లేదు. మరి కాంగ్రెస్ చాదస్తం ఆయనకు ఎప్పుడు వదులుతుందో?

## పొలిటికల్ ఫ్రస్ట్రేషనా?

ఎన్నిలకు ముందు కన్నా లక్ష్మీనారాయణ వైసిపిలో చేరాలనుకున్నాడు. కాని చివరి నిముషంలో అదిరించో, బెదిరించో అమిత్‌షా ఆపాడు. కన్నా అప్పుడే వైసిపిలో చేరుంటే ఇప్పుడు జగన్ మంత్రివర్గంలో ఆయనకు స్థానం వుండేది. చేజేతులా అది పోయిందనే బాధ... ఇక కరోనాకు ముందు స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గుంటూరు మేయర్ సీటును తన కొడుక్కి ఇస్తే వైసిపిలోకి వస్తానని ఆయన వైసిపి అధిష్టానానికి రాయబారం పంపించినట్లు తెలుస్తోంది. శాసనసభ ఎన్నికల తర్వాత పార్టీలో చేరిన వారికి పదవులు ఇవ్వకూడదన్నది జగన్ పాలసీ. ఈ కోవలోనే కన్నా ప్రతిపాదనను జగన్ తిరస్కరించాడని, ఈ కోపంతోనే జగన్‌పై కన్నా విపరీత ధోరణిలో మాట్లాడుతున్నాడని సమాచారం.

# 'లాక్' తీస్తే.. షాకే!

(మొదటి పేజీ తరువాయి)

సడలించేంత సురక్షిత వాతావరణం కూడా దేశంలో లేదు. ముఖ్యంగా మహారాష్ట్ర, తమిళనాడు, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, తెలంగాణ, ఏపిలలో వైరస్ తీవ్రత ఎక్కువగా వుంది. దేశంలోని 12రాష్ట్రాలలోనే దాదాపు 90శాతం కేసులు నమోదై వున్నాయి. ముఖ్యంగా మహారాష్ట్ర అయితే అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో వుంది. ముంబైలోని ధారావి మురికివాడలో వైరస్ కార్చిచ్చులా విస్తరిస్తోంది. కరోనా వైరస్ కట్టడిలో మహారాష్ట్రలోని ఉద్ధవ్‌థాకరే ప్రభుత్వం సమర్ధవంతంగా వ్యవహరించలేకపోతోంది. మహారాష్ట్రలో పెరుగుతున్న కరోనా పాజిటివ్ కేసులను చూస్తుంటే ఇంకొన్ని నెలల పాటు ఇక్కడ కఠిన నిబంధనలను అమలు చేయకతప్పదు. ఇక్కడ లాక్‌డౌన్ మే3వ తేదీ దాకా కాదు, ఆపైనకూడా రెండు, మూడు నెలలు కొనసాగించాల్సి రావచ్చు. గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలో కూడా మే నెలాఖరుదాకా లాక్‌డౌన్‌ను పొడిగించే అవకాశాలున్నాయి. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ మే 7వ తేదీ దాకా లాక్‌డౌన్‌ను పొడిగిస్తున్నట్లు ఇప్పటికే ప్రకటించాడు. ఏపిలో కూడా రెడ్‌జోన్‌లలో లాక్‌డౌన్‌ను పొడిగించే అవకాశాలున్నాయి. కొన్ని సడలింపులతో దేశవ్యాప్తంగా కూడా మరోసారి లాక్‌డౌన్ పొడిగించే పరిస్థితి రావచ్చు. మే 1 లేదా 2తేదీలలో ప్రధాని నరేంద్ర మోడీ మరోసారి టీవీల ముందుకొచ్చి ఈ విషయం ప్రకటించవచ్చు. కాబట్టి ఇంకొన్ని రోజులు పోరాటానికి ప్రజలు సిద్ధంగా ఉండాలి.

## ఎత్తేస్తే పెనుముప్పు...

లాక్‌డౌన్ కొనసాగిస్తూనే కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ, నిర్మాణ రంగం, వైద్యరంగం, వస్తు రవాణా, బ్యాంకింగ్ వంటి వాటికి కొన్ని సడలింపులనిచ్చింది. ఈ సడలింపుల వల్ల ప్రజలకు కాస్త ఊరట లభించింది. వ్యవసాయ ఉత్పత్తులు మార్కెట్లకు వెళ్లడంతో రైతులకు కాస్త నష్టం తగ్గింది. ప్రజలకు నిత్యావసర వస్తువుల కొరత కూడా లేదు. దేశ వ్యాప్తంగా విస్తృతంగా పేదలను ఆదుకునే సేవాకార్యక్రమాలు జరుగుతున్నాయి. కాబట్టి ఇదే జాగ్రత్తతో ఇంకొన్ని రోజులపాటు లాక్‌డౌన్ పొడిగించడమే ఉత్తమం. మే నెలలోనే రంజాన్ ఉపవాసాలు జరుగుతాయి. ముస్లింలు ఎంతో పవిత్రంగా భావించే మాసం. సామూహిక ప్రార్ధనలకు వాళ్ళు ప్రాధాన్యతనిస్తుంటారు. కాబట్టి లాక్‌డౌన్‌ను ఎత్తేస్తే వాళ్ళు సామూహిక ప్రార్ధనలకు, ఇఫ్తార్ విందులకు ప్రాధాన్యతనివ్వాల్సివుంటుంది. కొన్నిచోట్ల ఇలాంటివి జరిగినా వైరస్ ప్రభావం తిరగబెడుతుంది.

కరోనా వైరస్ ప్రబలాక అందరూ త్యాగాలకు అలవాటుపడుతున్నారు. రోజూ లక్షల్లో సంపాదించేవాళ్ళు కూడా ఇళ్ళల్లో కూర్చుంటున్నారు. భక్తి కార్యక్రమాలను ఇళ్లకే పరిమితం చేసుకుంటున్నారు. కాబట్టి కరోనా వైరస్‌ను నిర్మూలించే వరకు ఇంటినే దేవాలయంగా, చర్చిగా, మసీదుగా భావించాలి. అందరూ ఇదే స్ఫూర్తితో ఇంకొన్ని రోజులపాటు లాక్‌డౌన్ అమలుకు సహకరించాలి.

# ప్రకృతిని గాలి పీల్చుకోనివ్వండి!



**కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి,**
వ్యవస్థాపక ఛైర్మన్,
శాంతా బయోటెక్నిక్స్ లి.

కల చెదిరిపోవచ్చు....
వర్షం రాకపోవచ్చు....
సినిమా ఆడకపోవచ్చు....
ఇవన్నీ మనం ఊహించవచ్చు....

కానీ...

ప్రపంచం ఆగిపోతుందని ఎవరైనా ఊహించారా ?

ఊహించనిది జరగడమే జీవితం, అనుకుంటే .....
జరిగిన, జరుగుతున్న, పరిస్థితిని, విపత్తు అనాలా,
వినాశనం అనాలా, లేక మహమ్మారి వికటాట్టహాసం
అనాలా ?

తిన్నది అరక్క, గొడవపడితే,
కొద్ది రోజుల పాటు కర్ఫ్యూ చూశాం.

తిండికి లేక, గొడవపడితే లాఠీ చార్జ్ చూశాం.
అమ్మవారు పోసిందనో, అనుకోని జబ్బు వచ్చిందనో,
అయినవారుదూరం అయ్యారనో, స్వీయ గృహ
నిర్బంధం చూశాం.

కాని ఇవన్నీ కలకలిపి, ఒకేసారి అనుభవిస్తూ,
ఆచరించడం, బహూశా జీవితంలో ఇదే
మొదటిసారేమో !

మునుపెన్నడూ లేనివిధంగా,
సంస్కృతి, సాంప్రదాయాలపై, చర్చలు..
శుచి, శుభ్రతలపై అవగాహనలు..
తినే తిండిపై నియంత్రణలు.......
అడుగుతీసి, అడుగు వేయడానికి నిబంధనలు,
వెరసి కొత్త లోకంలో జీవిస్తున్న అనుభూతి..........

డబ్బులేని వారికి ఇది ఒక పాఠమా ?
అంటే ఉన్న వారికి ఇది గుణపాఠమా ?
లేక ప్రపంచానికి ఇది ఒక సవాలు మాత్రమేనా ?
కొద్ది కాలం తర్వాత,
యథా రాజా,
తథాప్రజానేనా...

ఘంటసాల గారు చెప్పినట్టు,
'ఏ నిమిషానికి ఏమి జరుగునో, ఎవరూహించెదరు'!!

ఒక్కసారి మార్చి 22 నుండి చూసుకుంటే.......

పబ్బుల్లేవు, క్లబ్బులు లేవు.
బార్లు లేవు, వైన్సులు లేవు.

'అయినా జీవితం ఆగిపోలేదు.' !!

అల్పాహారశాలలు, శాఖాహార-మాంసాహారశాలలు
పానీపూరీ, పావ్ బాజీ, మిర్చి బజ్జీలు లేవు.

**అయినా జీవితం ఆగిపోలేదు!!!**

హార్డ్ రాక్ కేఫులు లేవు,
బరిస్థా రెస్టారెంట్లు లేవు,
బావర్చి బిర్యానీలు లేవు,
బెస్కిన్ రాబిన్సన్ ఐస్క్రీములూ లేవు.

**అయినా జీవితం ఆగిపోలేదు!!!??**

బళ్ళు లేవు, బంకులు లేవు,
పెట్రోలు, డీజిలు, చింతలే లేవు.
బ్రాండెడ్ బట్టలు లేవు,
బరి తెగింపులు... అసలే లేవు.

అయినా జీవితం ఆగిపోలేదు!!!

చీరలు లేవు,
చీటికి మాటికి, షాపింగులు లేవు.
సినిమాలు లేవు, షికార్లు లేవు,
బాహ్య సౌందర్యానికి, బ్యూటీపార్లర్లు లేవు.

**అయినా జీవితం ఆగిపోలేదు....**

గుళ్ళులేవు, బడులు లేవు.
చర్చిలు, మసీదులు లేవు.

పూజలు లేవు, నమాజులు లేవు, ప్రార్ధనలూ లేవు...
నమ్మకమొక్కటే మిగిలింది.

**అయినా జీవితం ఆగిపోలేదు!!!!!!**

కాలుష్యం లేదు, కలహాలు లేవు,
కల్లబొల్లి మాటలతో, టైంపాసులు లేవు....
యాత్రలు లేవు,
తీర్థ యాత్రలు లేవు.
టూరిజం అంటూ టూర్లు లేవు....

**అయినా జీవితం ఆగిపోలేదు!!!!!!!!**

స్విమ్మింగ్ పూల్సు లేవు,
8 బాల్ పూల్సు లేవు,
మెక్డొనాల్డ్స్, పిజ్జాలు లేవు.
బర్గర్లు లేవు...

**అయినా జీవితం ఆగిపోలేదు!!!!!**

అయినదానికి, కానిదానికి అపాయింటుమెంట్లు
తీసుకుని, వేలకి వేలు తగలేసే రోగాలు, డాక్టర్లు
చెప్పకుండానే మాయమయ్యాయి.....
ఎలా ?

ఇరుగు, పొరుగు అంటు, మునుపటి బాంధవ్యాలు,
మళ్ళీ పుట్టాయి.......
ఎలా ?

పనివాళ్ళు రాకపోయినా పనులేవి ఆగలేదు......
ఎలా ?

మంచితనం. మానవత్వం, మబ్బు పట్టిన ఆకాశంలా,
ముంచెత్తే వరదలా, వెల్లువెత్తాయి.......
ఎలా?

డబ్బులున్నా ఏమీ కొనలేరు.
బయటకెళ్ళే ధైర్యం చేయలేరు....
నిత్యావసరాలు తప్ప
నిర్జీవమైన వేటిని కొనలేరు........

డబ్బున్న ధనవంతుడు, సామాన్యుడు,
అంతా ఒక్కటే అని ఎవరైనా చెబుతున్నట్టుందా ?

ఇన్ని సంవత్సరాలుగా మనం చేసిందేమిటి.....

మనకి మనమే అంతర్మథనం చేసుకోవాల్సిన
సమయమిది.. !!!!!!

కుటుంబ వ్యవస్థ బలోపేతమైందా ?
అన్యోన్యత పెరిగిందా ?
బంధాలు బలపడ్డాయా ?పిల్లలపై వాత్సల్యం
పెరిగిందా?
ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగిందా ?
ఆలోచనల్లో పదును పెరిగిందా ?
డబ్బుపై వ్యామోహం తగ్గి,
ప్రాణమున్న వాటిపై, ప్రేమ పెరిగిందా ?

ఇన్ని సంవత్సరాలుగా, మనం చేసిందేమిటి ? అనేది
వ్యక్తిగతంగా, ఎవరికి వారు ఆలోచించుకోవాల్సిన
సమయం బహూశా ఇదేనేమో ?

**ఆలోచించండి.**
**ఆచరించండి.**
**అనుభవించండి!**

"ప్రకృతిని గాలి పీల్చుకోనివ్వండి"!

# కరోనాతో...
# మారుతున్న ప్రపంచం

## • లాక్‌డౌన్‌తో ప్రకృతి పరవశం

*కరోనా!..కరోనా!..కరోనా!.. ప్రపంచవ్యాప్తంగా.. అందరినీ వణికిస్తున్న మాట ఇది. కరోనా వైరస్ దెబ్బకు ప్రపంచం తీవ్రమైన సంక్షోభంలో పడిపోయింది. సకల మానవాళి జీవనమంతా ఎక్కడికక్కడ గడ్డకట్టిపోయినట్లు ఘనీభవించిపోయింది. తనకు దొరికిన వారందరినీ అత్యంత కర్కశంగా మట్టుబెడుతున్న ఈ కరోనా రాక్షసిని ఎలా అంతం చేయాలో.. కంటికి కనిపించని అత్యంత సూక్ష్మమైన ఈ వైరస్ చేస్తున్న దారుణ మానవ మారణకాండ నుంచి తనను తాను ఎలా రక్షించుకోవాలో తెలియని దుర్గతిలో ప్రపంచమే అల్లాడిపోతూ ఉంది. ప్రతినిత్యం ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో రోజురోజుకీ కరోనా వైరస్ దెబ్బకు మృతి చెందుతున్న వారి సంఖ్య వందల నుంచి వేలసంఖ్యల్లోకి చేరిపోతూ ఉండడం.. మొత్తంగా లక్షలాది మంది ఈ వైరస్ ధాటికి మరణిస్తూ ఉండడంతో ప్రపంచమంతా బిక్కుబిక్కుమంటోంది. ఇంతటి అత్యంత భయంకరమైన విపత్తు ప్రపంచానికి రావడం ఇదే తొలిసారి.*

మనిషి వికృతాలోచనలతో తన చుట్టూ ఉన్న అందమైన ప్రకృతిని నాశనం చేసి, తన అభివృద్ధికి బాటలు వేసుకునే దురాలోచనలే ఇప్పుడు మానవ మనుగడను ప్రశ్నార్థకం చేసే దుస్థితికి తీసుకువచ్చాయి. ఏళ్ళ తరబడిగా సాగుతున్న ప్రకృతి హననంలో.. మనిషిని హాయిగా బతకనిచ్చే పంచభూతాలైన నీరు, నింగీ, నిప్పు, నేల, గాలినే కాలుష్య కాసారాలుగా చేస్తున్న మానవునికి ఇప్పుడు దుర్దశ ప్రాప్తించింది. ఒక్క మాటలో చెప్పాలంటే ఇది మనిషి చేసుకున్న స్వయంకృతాపరాధమే అనుకోవచ్చు. ప్రకృతి వరంలా ప్రసాదించిన అన్ని వనరులనూ అడ్డగోలుగా దుర్వినియోగం చేస్తూ, ప్రకృతిని, పర్యావరణాన్ని, పరిశుభ్రతను, ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు మనిషే చేజేతులా నాశనం చేసుకుంటూ వస్తున్నాడు. ఫలితంగా అనేకరకాల వైరస్‌లు ఎంతో కాలం నుంచి మానవాళిని చుట్టుముడుతున్నాయి. మానవాళి తన ప్రగతి కోసం తాను కూర్చున్న కొమ్మనే నరుక్కునే దుందుడుకు విధానాలు, విచ్చలవిడి ప్రవర్తనలు, నిరంకుశ ప్రవృత్తి అన్నీ కలసి వికటించి..చివరికి రకరకాల కాలుష్యాల రూపంలో మానవుడిని వెంటాడుతూనే ఉన్నాయి. ఈ భూమి మీద మనిషితో పాటు బతుకుతున్న అనేక రకాల జీవులను, పక్షులను, జంతువులను నిరంతరం పంచభక్ష్య పరమాన్నాలుగా భుజించే ఘోరమైన సంస్కృతి ప్రపంచాన్ని చుట్టేస్తూ ఉంది. చివరికి ఎలుకల్ని, పాముల్ని, కప్పల్ని గబ్బిలాలను సైతం వదలకుండా తినేసే అనాగరిక ప్రవృత్తి ప్రపంచంలో గొప్పగా చెప్పుకునే నాగరిక నగరాల్లోనూ పెచ్చరిల్లిపోయింది. నానాటికీ పేట్రేగిపోతున్న మానవుని వికృతత్వంపై ఆగ్రహించి.. ప్రకృతి వికటించి ఇప్పుడు కరోనా రూపంలో మానవునికి సవాల్ విసురుతోందన్నదే అందరి విశ్లేషణ. ప్రపంచంలోని అన్ని దేశాల్లోనూ గత నాలుగు నెలలుగా ఎడతెరపి లేకుండా కరోనా వైరస్ మృత్యుఘంటికలు మోగిస్తూనే ఉండడం కనీవినీ ఎరుగని ప్రపంచ కల్లోలమే. ఇంత భీతావహ పరిస్థితి ఈ భూప్రపంచం మీద ఎన్నడూ లేదు. అయితే, మనిషికి ఈ దుస్థితి ఒక శాపంగా మారినా..ప్రకృతి మాత్రం మునుపెన్నడూ లేనంత ప్రశాంతంగా ఉండడం విశేషం.

### ప్రకృతి పరవశిస్తోంది..

కరోనా మహమ్మారి నేపథ్యంలో ప్రపంచం అంతా లాక్‌డౌన్ కావడంతో జనజీవనం స్తంభించిపోయింది. ఒక్క మాటలో చెప్పాలంటే మానవ జీవన పరిస్థితే మారిపోయింది. అయితే ప్రకృతి మాత్రం పరవశిస్తోంది. కరోనా వైరస్ రాకుండా ఎవరికి వారు ఇళ్ళలోనే ఉండిపోయి లాక్‌డౌన్ పాటిస్తుండడంతో గత కొద్ది రోజులుగా ప్రపంచమంతా వీధుల్లో మానవసంచారం కనుమరుగవుతుండడంతో పక్షులు, జంతువులు స్వేచ్ఛగా తిరుగాడుతున్నాయి. అన్ని రకాల కాలుష్యాలు తగ్గిపోయి ఎంతోకాలం తర్వాత ఇప్పుడు భూమాత హాయిగా స్వచ్ఛ వాయువుల్ని పీలుస్తోంది. లాక్‌డౌన్‌తో మనదేశంలో కూడా కోటానుకోట్ల వాహనాలు ఎక్కడికక్కడ ఆగిపోవడం, బస్సులు, రైళ్ళు వగైరాలన్నీ నిలిచిపోవడంతో వాయు కాలుష్యం గణనీయంగా తగ్గిపోయిందని నిపుణుల అంచనా. ప్రపంచంలో అత్యంత కలుషిత వాతావరణం ఉన్న మొదటి 30 నగరాల్లో 21 మన దేశంలోనే ఉన్నాయని, లాక్‌డౌన్ మొదలయ్యాక వాయుకాలుష్యం సగానికి పైగానే తగ్గిపోయిందని నిపుణులు చెప్తున్నారు. అనేకానేక పరిశ్రమలు, వాహనాలు విడుదల చేసే కాలుష్యం వంటివన్నీ ఎక్కడికక్కడ ఆగిపోవడం, చివరికి విమానాలు కూడా ఎగరకపోవడంతో ఆకాశంలో కాలుష్యం కనుమరుగైపోతోంది. కరోనా మహమ్మారి దెబ్బతో ప్రపంచమే స్తంభించిపోయిన ప్రస్తుత తరుణంలో లాక్‌డౌన్ వల్ల వాయు కాలుష్యం, జల కాలుష్యం, శబ్ద కాలుష్యం వంటి కాలుష్యాలన్నీ బాగా తగ్గిపోవ డంతో ఆకాశం కూడా స్వచ్ఛంగా ఉంటోం దని, భూమాత స్వచ్ఛమైన గాలి పీల్చుకుంటూ సేద తీరుతోందని శాస్త్రవేత్తలు చెప్తున్నారు.



### పులకించిపోతున్న గంగానది

లాక్‌డౌన్ నేపథ్యంలో నదుల పరిస్థితి పూర్తిగా మారిపోయింది. పరిశ్రమల వ్యర్థాలతో, చెత్తాచెదారంతో కలుషితమైపోతున్న నదులన్నీ మళ్ళీ పరిశుభ్రతతో కళకళలాడుతున్నాయి. ముఖ్యంగా ఎంతో పవిత్రమైన మన గంగానదికి ఈ లాక్‌డౌన్ వల్ల ఎంతో ఉపయోగకరంగా ఉంది. గంగానదిని ప్రక్షాళన చేసేందుకు కేంద్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్న నేపథ్యంలో, ఇప్పుడు లాక్‌డౌన్ వల్ల గంగానది చుట్టుపక్కల ఉన్న రాష్ట్రాల్లోని పరిశ్రమలన్నీ మూతబడిపోవడంతో ఆయా పరిశ్రమల వ్యర్థాలు గంగానదికి చేరే పరిస్థితే లేదు. దీంతో గంగమ్మతల్లి ఆనందం అంతా ఇంతా కాదు. స్వచ్ఛతతో గంగమ్మ తల్లి పులకించిపోతూ ఉంది. రైళ్ళు, బస్సులు, వాహనాలు నడవకపోవడంతో నిత్యం వీటిద్వారా వెలువడుతున్న భారీస్థాయి కాలుష్యానికి లాక్‌డౌన్‌తో ఫుల్‌స్టాప్ పెట్టినట్లయింది. ఇంధన వాడకం తగ్గిపోయి, కర్బన ఉద్గారాలు కూడా తగ్గి కాలుష్యం నెమ్మదిగా కనుమరుగవుతుండడంతో చరిత్రలోనే మున్నెన్నడూ లేని విధంగా అన్ని రకాల కాలుష్యాలకు అడ్డుకట్ట పడుతోంది. ఈ పుణ్యమంతా.. లాక్‌డౌన్ వల్లేనని శాస్త్రవేత్తలు ఘంటాపథంగా చెప్తున్నారు. అంతేకాదు, మనుషులెవరూ కనిపించకపోవడంతో అనేక ప్రాంతాల్లో పక్షులు, జంతువులు స్వేచ్ఛగా విహరిస్తున్నాయి. లాక్‌డౌన్ ప్రభావం వల్ల భూమి ప్రకంపనలు కూడా నెమ్మదించాయని, కాలుష్యాలన్నీ తగ్గిపోవడంతో భూమాత హాయిగా ఊపిరి తీసుకుంటోందని శాస్త్రవేత్తలు తమ పరిశోధనల్లో గుర్తించారు. లాక్‌డౌన్‌తో మనిషి కూడా కుదుటపడుతున్నాడు. లాక్‌డౌన్ తర్వాత భౌతిక దూరం పాటించడం, స్వీయనిర్బంధంలో ఉండడంతో తాము సురక్షితంగా ఉన్నామని, మానసికంగా ఆందోళన బాగా తగ్గిందని శాస్త్రవేత్తల అధ్యయనాలు తెలుపుతున్నాయి. ఈ లాక్‌డౌన్‌తో మానవీయమైన సంబంధాలు, కుటుంబ బంధాలు, అనుబంధాలు కూడా గతంలో కంటే బాగా పెరిగాయనే చెప్తున్నారు. లాక్‌డౌన్‌తో ఒక్కసారిగా ప్రపంచమే రీసెట్ అవుతోంది. ఈ విపత్కర పరిస్థితుల్లో తనను తాను పునరాలోచించుకునే అవకాశం ఈ లాక్‌డౌన్ వల్లనే మనిషికి కలుగుతోంది. కరోనాను కట్టడిచేసే ఆయుధం కూడా లాక్‌డౌనే. అది కూడా మనచేతుల్లోనే ఉంది. ఎవరి ఇళ్ళలో వారు ఉండి లాక్‌డౌన్ పాటించడమే మనందరి కర్తవ్యం. మన రక్షణ కోసం ప్రభుత్వాలు చెప్తున్న నియమాలు పాటించడం ద్వారానే.. ఈ విపత్కర పరిస్థితుల నుంచి మనల్ని మనం కాపాడుకోగలం.

### ప్రకృతిని రక్షించుకోవాలి..

కరోనా మనిషి పాలిటి శాపమే అయినా, ఇప్పుడు అదే ప్రకృతికి వరంగా మారింది. ఒకరకంగా ఇది ప్రకృతికి పునరుజ్జీవం అని చెప్పక తప్పదు. అయినా, మనకి ప్రాణం పోసే గాలి, నీరుతో కలసి తల్లిలా మనల్ని కంటికి రెప్పలా కాపాడుతున్న ప్రకృతిమాతను మనం ఏమాత్రం నిర్లక్ష్యం చేయకూడదు. ప్రకృతిని కూడా మనం తల్లిలాగానే అనుక్షణం కాపాడుకోవాలన్న సత్యాన్ని ఈ పరిస్థితి స్పష్టం చేస్తోంది.

### మానవుడే విజేత

ఒక్క కరోనాయే కాదు, ఎలాంటి ప్రాణాంతకమైన వైరస్‌లనైనా జయించే శక్తి మానవునికి ఉంది. ఎప్పటికైనా మానవుడే విజేత. ఈ విపత్కర పరిస్థితుల్లో భయాన్ని పక్కనపెట్టి ధైర్యంగా ఎదుర్కోవాలి. కరోనా ఇప్పుడు కరాళ నృత్యం చేసినా.. రేపో మాపో దాని అంతు చూసే శక్తి విజ్ఞానఖనులైన మన శాస్త్రవేత్తలకు ఉంది. అయితే కాస్తంత సమయం పడుతుంది..అంతే!.. అసలు ఇలాంటి మహమ్మారి వైరస్‌లను ఇక పుట్టకుండా చేయగలిగే సత్తా కూడా అమేయ విజ్ఞానవంతుడైన మానవునికి ఉంది. అలా చేయాలంటే ప్రకృతిని కాపాడుకోవడమొక్కటే మార్గమని ప్రకృతి మాతే మనకు స్పష్టంగా చెప్తోంది. అందుకే, మనిషి ప్రకృతి పట్ల తాను చేస్తున్న తప్పుల్ని సరిదిద్దుకోవాలి. భూమాతకు హాని చేసే కాలుష్యాలను తరిమికొట్టాలి. కరోనా వంటి వైరస్ వ్యాధులను పారద్రోలాలి. అందుకు ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతను తాము నిర్వర్తించాలి.

### ఆ మహనీయులకు వందనం

ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా కోటానుకోట్ల మంది వైద్యులు కరోనా మహమ్మారి వ్యాధిని నివారించేందుకు, దానిని అంతమొందించేందుకు ప్రాణాలకు తెగించి అనుక్షణం చేస్తున్న పోరాటం అద్వితీయమైనది. వారితోపాటు పారిశుద్ధ్య కార్మికులు, ప్రభుత్వాలు, అధికారులు, పోలీసులు, దాతలు, స్వచ్ఛంధసేవకులు ఇలా ఎంద రెందరో మహానుభావులు..కరోనాను జయించేందుకు, బాధితుల ప్రాణాలు కాపాడేందుకు అలుపెరుగని పోరాటం చేస్తున్నారు. వారందరికీ కృతజ్ఞతాపూర్వకంగా సెల్యూట్ చేయడం మనందరి నైతిక ధర్మం. ఏదేమైనా. ఈ పోరాటంలో మనం జయిస్తాం. జయం మనదే!..ఇందులో ఎలాంటి సందేహం లేదు. ఆ సూక్ష్మక్రిమి క్లూ దొరికితే చాలు.. దాని పని అయిపోయినట్లే. అంతదాకా ధైర్యంగా ఉండాలి. కరోనాను అంతమొందించి, సరికొత్త ఆలోచనలతో.. సరికొత్త సమాజాన్ని..ఎలాంటి కాలుష్యాలు సోకని.. అత్యంత ఆరోగ్యవంతమైన ప్రపంచాన్ని సృష్టించుకునే రోజు మానవాళికి అత్యంత దగ్గరలోనే ఉంది.

# దారుణం.. ఈ కిరాతకం



మహారాష్ట్ర, పాల్ఘర్‌లో ఇద్దరు కాషాయధారులైన సాధువులను ఒక వర్గానికి చెందిన వందమందికిపైగా వున్న గుంపు కర్రలతో దాడిచేసి అమానుషంగా చంపడం ఇప్పుడు దేశ వ్యాప్తంగా సంచలనం రేకెత్తిస్తోంది. వారిద్దరిని దొంగలుగా అనుమానించి స్థానికులు కొట్టి చంపారని చెప్పి కొన్ని మీడియాలు కూస్తున్నాయి. మరి వాళ్ళు దొంగలైతే పట్టుకుని పోలీసులకు అప్పగించాలిగాని కొట్టి చంపడమేమిటి? ఇది ఎంతటి అమానుషం. అది కూడా తమ ప్రాణాలు కాపాడండని వాళ్లిద్దరూ ఒక పోలీస్‌ను వేడుకుంటుంటే, ఆ పోలీసు తనకేమీ సంబంధం లేదన్నట్లు వాళ్ళ చేయిని విదిల్చుకుని ఆ సాధువులను ఆ గుంపులోకి నెట్టేయడం కలచివేసే విషయం.

ప్రపంచమంతా లాక్‌డౌన్ అమలులో వుంది. దొంగతనాలు చేసే దొంగలు కూడా ఇళ్ళల్లోనే వున్నారు. పోలీసులు 24గంటలూ రోడ్ల మీద వుంటున్నారు. ఇలాంటి తరుణంలో అసలు దొంగతనాలకు ఎక్కడ ఆస్కారముంటుంది. ఒకవేళ ఆ ఇద్దరు సాధువులు ఏదన్నా తప్పు చేసుంటే వారిని మందలించి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించవచ్చు. అంతేగాని, అతి దారుణంగా కర్రలతో కొట్టి చంపడమేంటి? మనం నాగరిక సమాజంలోనే వున్నామా? ముందు మనిషిని మనిషిగా చూడాలి. మనిషి పుట్టిన తర్వాతే మతం అన్నది అతనికి తెలుస్తుంది. మతం కోసం లేదా మత విద్వేషంతో ప్రాణాలు తీసే దుర్మార్గానికి ఎవరు పాల్పడినా తప్పే! గతంలోనూ ఆవు మాంసం తింటున్నారనో, అమ్ముతున్నారనో ఆరోపణలతో మనుషులపై మూకదాడులకు పాల్పడి క్రూరంగా చంపారు. మన దేశంలో అత్యంత కిరాతకంగా రేప్‌లు, హత్యలు చేసేవాళ్ళకే శిక్ష పడడానికి పదేళ్లు పడుతుంది. ఎంత దుర్మార్గుడికైనా ఈ దేశంలో న్యాయ సహాయం లభిస్తుంది. అలాంటిది లేనిపోని అనుమానాలతో తప్పులు చేశారో, లేదో తెలియని వ్యక్తులను క్రూరంగా కొట్టి చంపడం దారుణం. ఇలాంటి చర్యలకు ప్రభుత్వం కఠినంగా కళ్లెం వేయాల్సివుంది.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com